ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 19 జనవరి 2025 | 5





కోరుకొండలో రుడా చైర్మన్ బీవీఆర్ తదితరుల నివాళి

## ఇక ప్రతి నెలా మూడో శనివారం
# స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్

### ఏడాది పాటు ప్రణాళిక - కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమ నిర్వహణకు ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు.రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజీవ్ కాలనీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిరంతర పారిశుధ్య నిర్వహణలో ప్రత్యక్షంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు.ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌గా పాటిస్తామన్నారు.అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ప్రాంగణంలో పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీపీవో ఎం.నాగలత,ఎంపీడీవో శ్రీనివాసరావు,ధవళేశ్వరం సీఐ గణేష్, ఈవోపీఆర్డీ ఆర్మ్ స్ట్రాంగ్,ఆళ్ళ ఆనందరావు, సాగర్ పాల్గొన్నారు.




గోపాలపురంలో మైక్ పట్టుకుని స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్

రాజీవ్‌కాలనీలో సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

# ఎన్‌టీఆర్‌కు ఘన నివాళులు

ఎన్‌టీఆర్ చిరస్మరణీయుడు.. నేటికీ ప్రజల హృదయాల్లో ఆయన స్థానం సజీవం.. ఎన్‌టీఆర్ దూరమై 29 ఏళ్లయినా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మహనీయుడు.. మహాత్ముడు.. మా దేవుడు అంటూ కొలిచారు.. ఊరూవాడా విగ్రహాలకు అభిమానులు..నాయకులు పూల దండలు వేసి నివాళులర్పించారు.. - 8లో



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తదితరులు



తిరిగి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారిన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్

# తిరుగు ప్రయాణం

- ఆర్టీసీకి పెరిగిన రద్దీ
- హైదరాబాద్‌కు 13 స్పెషల్స్
- 8 షెడ్యూలు బస్సులు
- మొత్తం 21 సర్వీసులు
- రహదారులు కిటకిట
- కార్లలో తిరుగుముఖం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెద్ద పండగ ఆనందంగా ముగించుకున్న జిల్లా ప్రజానీకం తిరుగు ప్రయాణాల బాటపట్టారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాలోని స్వగ్రామాలకు వచ్చిన జనమంతా పిల్లాపాపలతో పెద్ద సంఖ్యలో తిరుగు ప్రయాణమవుతున్నారు. కొందరు రైళ్లు, బస్సులను ఆశ్రయిస్తుంటే మరి కొందరు సొంతకార్లు, ప్రైవేట్ వాహనాల్లో తిరిగి బయలుదేరారు. దీంతో శనివారం రాజమహేంద్రవరం,నిడదవోలు, కొవ్వూరు పట్టణాల్లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లు,రైల్వేస్టేషన్ ప్రాంతాలు రద్దీగా మారాయి. ప్రధానంగా జిల్లా నుంచి దూరప్రాంత ఆర్టీసీ సర్వీసులన్నీ ఫుల్‌గా వెళుతున్నాయి. శనివారం రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం ఆర్టీసీ డిపోల నుంచి 13 స్పెషల్ బస్సు సర్వీసులు హైదరాబాద్‌కు పంపించారు. వీటితో పాటు షెడ్యూలు బస్సులు మరో 8 కూడా హైదరాబాద్ వెళ్లాయి. టిక్కెట్లన్నీ గతంలోనే రిజర్వేషన్ చేసుకోవడం జరిగింది. సంక్రాంతి పండగ సమయంలోనూ ఆర్టీసీ టిక్కెట్ రేట్లు పెంచకపోవడంతో ప్రయాణీకుల నుంచి ఆర్టీసీకి మంచి డిమాండ్ పెరిగింది.

### పెరిగిన లోకల్ ట్రాఫిక్..

విజయవాడ, విశాఖపట్నం రూట్లలోనూ ట్రాఫిక్ బాగా పెరిగింది. ఈ రెండు రూట్లలోనూ జిల్లా నుంచి షెడ్యూలు బస్సులను మాత్రమే తిప్పుతున్నారు. ప్రయాణీకుల రద్దీ పెరిగితే స్పెషల్ బస్సులను తిప్పేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు.ఈ రూట్లలో అటు విశాఖపట్నం, ఇచ్ఛాపురం, విజయవాడ ప్రాంతాల నుంచి వయా రాజమహేంద్రవరం మీదుగా పెద్దసంఖ్యలోనే ఆర్టీసీ సర్వీసులు నడుస్తుంటాయి. దీని వల్ల రద్దీని బట్టి బస్సులను సర్దుబాటు చేసుకునే వీలుంటుంది. ఇక రాజమహేంద్రవరం నుంచి కాకినాడ, తుని, గోకవరం, అమలాపురం, రావులపాలెం, ఏలూరు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం తదితర లోకల్ రూట్లలోనూ ప్రయాణాలు ఊపందుకున్నాయి.

### నేడూ రద్దీ కొనసాగే అవకాశం..

స్కూళ్లు, కొన్ని ఇతర విద్యాసంస్థలకు ఆదివారం వరకూ సెలవులు ఇచ్చారు.దగ్గర ఊళ్లకు చెందిన చాలా మంది ఆదివారం ప్రయాణాలు సాగించే అవకాశం ఉంది. ప్రధానంగా లోకల్ ట్రాఫిక్ పెరగనుంది. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులను తిప్పడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.మరో పక్క హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున ఆర్టీసీ ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. జిల్లా నుంచి ఆదివారం రాత్రి 13 ప్రత్యేక బస్‌లు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నారు.



# బరి తెగించారు!

## కో అనడానికే..కోట్లు దండుకున్నారు..

- నేతల అనధికార అనుమతులు
- పోలీసుల రహస్య ఒప్పందాలు
- మామూళ్ల మత్తులో జోగిన వైనం
- ముందస్తుగా ఆధార్‌లు సేకరణ?
- చివరి రోజున కేసుల నమోదు
- సంక్రాంతిలో కానరాని ఖాకీలు
- యథేచ్ఛగా సాగిన పందాలు
- రూ.200 కోట్ల లావాదేవీలు
- మంత్రి ఇలాఖాలోనూ జోరుగా

నిడదవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బరి తెగించారు.. పందాల నిర్వాహకులే కాదు... పోలీసులు.. నాయకులు కూడా.. ఒకరు అనధికార అనుమతులివ్వడానికి డబ్బులు దండుకుంటే మరొకరు అడ్డురాకుండా ఉండేందుకు డబ్బులు దండుకున్నారు.. మూడు రోజులు ఏ ఒక్కరూ కిక్కురుమనలేదు.. హైకోర్టు కాదన్నా యథేచ్ఛగా పందాలు సాగాయి.. సంక్రాంతి పండుగ మూడు రోజులు పందాలతో బరులు రక్తమోడాయి. ముందు నుంచి హడావుడి చేసిన పోలీసు యంత్రాంగం పండుగ మూడు రోజులు పత్తా లేకుండా పోయారు. చివరి రోజు మాత్రం మేం పట్టుకున్నామంటూ జిల్లా వ్యాప్తంగా 338 కేసులు నమోదు చేసి 976 మందిని అరెస్టు చేశారు.పండుగ మూడు రోజులు కోడి పందాలకు లక్షలాది రూపాయలు పోలీసులు,నాయకులకు మామూళ్లు ఇచ్చినట్టు పందాల నిర్వాహకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

### పోలీసుల రహస్య ఒప్పందం..

జిల్లాలో ప్రతి ఏడాది జరిగే తంతే ఈ ఏడాది జరిగింది. కోడిపందాలకు అనుమతి లేదంటూ ముందు నుంచి పోలీసులు ప్రచారాలతో ఊదరగొట్టేశారు. నిర్వాహకులు మాత్రం ఇది షరా మామూలే అంటూ బరుల ఏర్పాటు చేసుకున్నారు. అటు నాయకులు.. ఇటు పోలీసులతో ఎవరైతే మాట్లాడుకున్నారో వాళ్ల బరులను టచ్ చేయలేదు. ఎవరైతే కలవలేదో వారిపై దృష్టి పెట్టి కొన్నిచోట్ల పేరుకు మాత్రమే బరులను ధ్వంసం చేస్తూ పందేలు వేస్తే ఊరుకునేది లేదంటూ తాటాకు చప్పుళ్లు చేశారు. భోగి ముందు రోజు వరకు ఈ తంతు సాగింది. భోగి రోజు ఉదయాన్నే బహిరంగంగా కోడిపందాలు, గుండాట, పేకాట మొదలయ్యాయి. అయినా పోలీసులకు అవేమీ కనిపించలేదు. జాతీయ రహదారుల పక్కన బరులు వేసినా అవీ కనిపించకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో సుమారు 150 నుంచి 200 వరకు బరులను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఆడేశారు.ఈ బరుల్లో భారీగా లావాదేవీలు సాగాయి.గోకవరం మండలంలో ఒక చిన్న బరికి పోలీసులు రూ.20 వేలు లంచంగా తీసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బరుల వద్ద గుండాట జోరుగా సాగింది.. బరిని బట్టి గుండాటకు వేలం వేశారు. జిల్లాలోని ఒక బరిలో అయితే రూ.10 లక్షలకు పాడుకున్నట్టు సమాచారం. బరిలో గుండాట,కోతాట, పేకాట యథేచ్ఛగా నిర్వహించారు. ఈ ఏడాది జరిగిన పందాల్లో బరికి ఇన్ని కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు ముందుగానే బరుల నిర్వాహకుల నుంచి ఆధార్ కార్డులు తీసుకున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లాలో పోలీసులు..బరుల నిర్వాహకులకు రహస్య ఒప్పందం జరిగినట్టు సమాచారం.

### జిల్లా వ్యాప్తంగా.. యథేచ్ఛగా..

జిల్లాలో ఎక్కడా పందాలు ఆగలేదు..మూడు రోజులు యథేచ్ఛగా సాగాయి.. ప్రధానంగా నిడదవోలు, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్,కొవ్వూరు, అనపర్తి, గోపాలపురం నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పందాలు సాగాయి. గోపాలపురం మండలం వేళ్ల చింతలగూడెంలో అయితే బరిని క్రికెట్ స్టేడియం తలపించేలా తీర్చిదిద్దారు. ఒక్కో బరిని బట్టి నాయకులు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా జిల్లాలో ఒక నియోజకవర్గానికి చెందిన నాయకుడు పెద్ద బరికి రూ.10 లక్షల వరకూ వసూలు చేసినట్టు ఆరోపణలు చేశారు.ఇలా జిల్లాలో కోడి పందాల బరుల నుంచి కొందరు నాయకులు పోలీసులతో పోటీపడి డబ్బులు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.



### మంత్రి ఇలాఖాలోనూ ఇంతే..

జిల్లాలోని మంత్రి దుర్గేష్ నియోజకవర్గమైన నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోనూ పెద్ద ఎత్తున బరులు వెలిశాయి.పెరవలి మండలం ఖండవల్లిలో అయితే ఒక యువకుడు గుండాటలో డబ్బులు పోగొట్టుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన విదితమే.దీనిపై కేసు నమోదు కాలేదు.ఎక్కడో శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చి ఇక్కడ గుండాట నిర్వహించినట్టు సమాచారం.నిడదవోలు పట్టణంలో కోడిపందాల బరుల విషయమై రెండు పెద్ద సామాజిక వర్గాల మధ్య నువ్వా నేనా అన్న రీతిలో వివాదం చోటు చేసుకుంది.నిడదవోలు పట్టణానికి చెందిన ఒక యువ నాయకుడు కోడిపందాల బరి ఏర్పాటుకు సిద్ధం కాగా నియోజకవర్గానికి చెందిన మరో నాయకుడు ఆ బరిని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు.ఈ వివాదంలో పట్టణానికి చెందిన యువ నాయకుడే గెలిచి భోగిరోజు ఉదయానికి బరిలో నిలిచి కోడి పందాలు ప్రారంభించాడు.ప్రస్తుతం ఆ వివాదం కాస్తా ముదిరిపాకాన పడింది.. రాజకీయ వైరంగా మారింది. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 20 వరకూ బరులు వెలసినట్టు సమాచారం. ఒక్క నిడదవోలు పట్టణం, మండలంలోనే సుమారు 13 బరులు ఏర్పాటు చేశారు. పోలీసులు నాయకుల ఒప్పందం ప్రకారమే పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్ట్ చేసి రూ.7,700, సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్ట్ చేసి రూ.4500లు నగదు స్వాధీనం చేసుకున్నారు. మంత్రి ఇలాకాలో జరిగిన కోడిపందాల్లో కోటి రూపాయలకు పైగా పందాలు జరగ్గా పోలీసులు నాయకులు ఒప్పందం ప్రకారం తూతూ మంత్రంగా కేసులు నమోదైనట్టు సమాచారం.



తాడిమళ్ల గ్రామాన్ని సందర్శించి అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

### తాడిమళ్లలో రీసర్వే ఆరంభం

#### పైలట్ గ్రామంగా ఎంపిక

నిడదవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రారంభించిందని.. జిల్లాలో పైలట్ గ్రామంగా తాడిమళ్ళను ఎంపిక చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. నిడదవోలు మండలం తాడిమళ్ళలో శనివారం కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, రైతు, భూ యజమానుల వారీగా భూముల గుర్తింపు మ్యాపింగ్ పారదర్శకంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే గ్రామాల్లో గ్రామ సభలు బహిరంగ సభలు నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా భూముల రికార్డులను రూపొందించాల్సి ఉందన్నారు. ఇందుకు 120 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పాటు ఎస్‌వోపీని రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక గ్రామం చొప్పున 16 గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఉనకరమిల్లి గ్రామంలో రోడ్డు పనులు పరిశీలించారు. ఆమె వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత,డ్వామా పీడీఎ.నాగ మహేశ్వరరావు, సర్వేల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు బి.లక్ష్మీ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు ముగిసిన దేహదారుఢ్య పరీక్ష 7



# అక్రమాలకు.. అడ్డా!

కార్పొరేషన్ వెహికల్ యార్డ్‌లో వాహనాలు

## కార్పొరేషన్ వెహికల్ యార్డ్‌లో కనికట్టు

- అదోక మాయాప్రపంచం
- నిర్వహణకు లక్షలు ఖర్చు
- మరమ్మతుల్లో చేతివాటాలు
- గతంలో ఆయిల్ మింగుడే
- సిబ్బందిపై కమిషనర్ చర్యలు
- ఇంకనూ తేల్చని లెక్క
- గాలికొదిలేసిన విచారణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కార్పొరేషన్ వాహనాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వెహికల్‌యార్డ్ అక్రమాలకు అడ్డాగా మారింది.. ఈ యార్డ్‌లో ప్రతినెలా లక్షలాది రూపాయలు దుర్వినియోగమవుతున్నాయి.కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అండర్‌లో క్వారీ సెంటర్ నుంచి లాలాచెరువు వెళ్లే మార్గంలో ఈ వెహికల్ యార్డ్ ఉంది.దీనిలో కార్పొరేషన్‌కు చెందిన 127 వాహనాలు పార్క్ చేస్తారు.ప్రతి రోజు ఉదయం 5 గంటలకు బయటకు వెళ్లిన వాహనాలు మధ్యాహ్నం 2 గంటలకు యార్డ్‌కు చేరుకుంటాయి.గత ఐదేళ్లలో ఈ వెహికల్ యార్డ్‌లో అనేక అక్రమాలు సాగాయి. దీనిలోని వాహనాల ఇంధనానికే నెలకు సుమారు రూ.25 లక్షల పైబడి ఖర్చవుతుంది.అయినా ఇదేమిటని ప్రశ్నించిన అధికారులే లేకపోయారు.ప్రస్తుత కమిషనర్ కేతన్‌గార్గ్ మాత్రం ఆరా తీశారు. సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించారు.. అవకతవకల లెక్కను మాత్రం తేల్చడం మరిచారు.

### లక్షల్లో ఖర్చులు.. అన్నింటా తేడాలు

కార్పొరేషన్ వాహనాల మెయింటెనెన్స్‌కు సంబంధించి సమస్యను క్యాష్ చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఇన్‌చార్జిలుగా చేసేవారు గతంలో ఒక అధికారితో సమన్వయం చేసుకుని ఆయిల్ వినియోగంలో వాహనాలిచ్చే మైలేజ్‌ను తేడా చూపించి ఆయిల్ బిల్లులు నొక్కేసేవారు. వాహనాల ఆయిల్‌కి నెలకు రూ.18 లక్షల వరకు వినియోగం చూపించారు. వాహనాలను ఇష్టానుసారం వాడేవారు. ఎలా అంటే కార్పొరేషన్ వాహనాలు నగరపరిధి దాటి వేరొక ప్రాంతంలో కూడా కనిపించేవి. చాలా వరకు మరమ్మతుల విషయంలో లెక్కాపత్రం లేకుండా బొక్కేసినట్టు సమాచారం.ఇలా లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయి ఇన్‌చార్జి, ఇంజనీరింగ్ విభాగంలో ఒక అధికారి కలిసి చాలా పద్ధతిగా ఎక్కడా దొరక్కుండా లాగేసినట్టు తెలిసింది.ప్రభుత్వం మారగానే ఆ అధికారి మారిపోవడంతో వెహికల్ యార్డ్‌లో ఉన్న ఇన్‌చార్జి గొంతులో వెలక్కాయ పడింది. కొత్త అధికారిని లైన్‌లో పెట్టుకుని పాత పాట పాడుదామని అనుకుంటున్న తరుణంలో కమిషనర్ కేతన్ గార్గ్‌కు అనుమానం వచ్చి వాహనాలను తనిఖీ చేశారు. మరమ్మతుల విషయంలో కొన్ని విషయాలు ఆరా తీయడంతో ఒక్కసారిగా ఈ ముఠా ఖంగుతిని సైలెంట్టైపోయింది. కమిషనర్ వెహికల్ యార్డ్‌ను తనిఖీ చేయడంతో చాలా విషయాలు బయటకు వచ్చి ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రాధాన్యతను తగ్గించారు. వాహనాల ఆయిల్ కూపన్ కూడా వెహికల్ యార్డ్‌కు సంబంధం లేకుండా చేశారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడంతో ఆయిల్ స్కామ్ జరుగకుండా చెక్ పడింది.మరి గతంలో జరిగిన దోపిడీపై సిబ్బందిని పక్కన పెట్టారు కానీ..ఆయిల్ దుర్వినియోగం, అవకతవకలపై మాత్రం ఎటువంటి విచారణ లేదు.

## మినీ గోకులాలపై
# అలక్ష్యం!



- షెడ్ల నిర్మాణాల్లో ఏదీ పురోగతి
- జిల్లాకు మంజూరైనవి 675
- పూర్తయినవి 322
- ఊపందుకోని నిర్మాణాలు

గోకవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మినీ గోకులాల పథకం కేటాయింపులు వేగవంతంగా చేస్తున్నట్టు ఇటీవల మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి ప్రకటించారు.. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే మినీ గోకులాలకు రైతులు ఎదురుచూస్తుంటే అధికారుల మాత్రం నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒక పక్క రైతుల ఆశలను మరో పక్క ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. జిల్లాలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది పాడి పోషణపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాడి రైతాంగానికి ఎటువంటి చేయూత లభించలేదు. పైగా గతంలో నిర్మించిన గోకులాలను గాలికొదిలేశారు. పశువులు, కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకందార్లను అసలు పట్టించుకోలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి రైతుల సంక్షేమంలో భాగంగా మినీ గోకులాల నిర్మాణానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. గోకులం షెడ్ల నిర్మాణానికి రాయితీలు ఇచ్చారు. దీంతో పాడి రైతాంగం, కోళ్ల పెంపకందారుల నుంచి అధికారులకు వందలాది దరఖాస్తులు అందాయి. కానీ షెడ్ల నిర్మాణాలకు అధికారుల నుంచి అనుమతులు మాత్రం లభించడంలేదు. షెడ్ల నిర్మాణ లక్ష్యం ఇప్పటికే పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ఇంత వరకూ సగం నిర్మాణాలు పూర్తి కాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువై మంజూరు కాబడిన షెడ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించ డంలేదు. దీని వల్ల కొత్తగా షెడ్ల నిర్మాణాల కు ఎదురుచూస్తున్న రైతుల్లో నిరాశ నెలకొంది.పాతవారు పూర్తి చేస్తేనే తమకు షెడ్లు మంజూరు చేయడం ఏమిటంటూ అధికారులపై మండి పడుతున్నారు.

### జిల్లాకు 675 షెడ్లు

తూర్పుగోదావరి జిల్లాలోని 18 మండలాలకు సుమారు 675 మినీ గోకులం షెడ్లు మంజూరు చేశారు.ఒక్కో షెడ్డుకు రూ.లక్ష పైనే అందజేస్తారు. రాయితీ సుమారు 75 శాతం పైనే ఉంది. దీంతో షెడ్లకు డిమాండ్ పెరిగింది. అయితే కేటాయింపులు మాత్రం జరగడంలేదు.జిల్లాలో ఇప్పటి వరకు 322 వరకూ పూర్తయినట్టు లెక్కల్లో చూపి స్తున్నారు.మరికొన్ని నిర్మాణాల్లో ఉన్నాయంటు న్నారు. సుమారు రెండు నెలలు కావొస్తున్నా సగం షెడ్ల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో కొత్తగా షెడ్ల నిర్మాణాలకు ఎదురుచూస్తున్న పాడి రైతుల్లో నైరాశ్యం నెలకొంది. గోకులం షెడ్లకు రాయితీ ఎక్కువగా ఉండంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు. ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లాలో మినీ గోకులాల నిర్మాణాలపై దృష్టి సారిస్తే తప్ప ఊపందుకునేలా కనిపించడంలేదు.

# భలే..భలే బోన్సాయ్

## సుమనోహరం..చిట్టి చెట్ల వనం

కాకినాడ జన్మభూమి పార్కులో బొన్సాయ్ గార్డెన్
చిట్టి కుండీల్లోనే వృక్షాల పెంపకం

అక్కడకు వెళ్తే స్వచ్ఛమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. పచ్చని మొక్కలు ఆహ్వానం పలుకుతాయి. అవేమీ భారీగా ఉండవండి.. చిన్నచిన్నగానే ఉంటాయి. మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. అటువంటి ఆకర్షణీయమైన, ఆహ్లాదకరమైన ప్రాంతంగా.. అరుదైన బొన్సాయ్ మొక్కలకు నిలయంగా మారింది కాకినాడ జన్మభూమి పార్కు.. ఇక్కడి బొన్సాయ్ గార్డెన్‌కు వెళ్తే మనసు ఒక్కసారిగా తేలికపడుతుంది. ఆ చిన్నచిన్న మొక్కలను చూస్తేనే చాలు ఎంతో ముచ్చట గొలుపుతుంది. కాకినాడ నగరపాలక సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ బొన్సాయ్ గార్డెన్ గురించి తెలుసుకుందాం..

ఆంధ్రజ్యోతి/ కార్పొరేషన్(కాకినాడ):

**బొన్సాయ్ అంటే..**

బొన్సాయ్ అంటే జపనీస్ భాషలో చిన్నకుండీలో పెరిగిన చెట్టు అని అర్థం. పూర్తిగా పెరిగిన వృక్షాల్లాగే అచ్చుగుద్దినట్లు చిన్న పరిమాణంలో ఉంటాయి. పరిసరాలకు అదనపు అందం తెచ్చిపెట్టే ఈ బొన్సాయ్‌లు ఎవరి దృష్టినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. బొన్సాయ్‌లు పెద్ద చెట్టు లక్షణాలే పూర్తిస్థాయిలో కలిగి ఉంటాయి.

**120 మొక్కలతో..**

కాకినాడలోని జన్మభూమి పార్కులో వివిధ రకాల జాతులకు చెందిన 100 నుంచి 120 మొక్కలను అందంగా అలంకరించారు. 2018లో రూ.40లక్షల నిధులతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ మొక్కలను హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి ఇక్కడ పెంచుతున్నారు. ఈ వృక్షాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.








**సంరక్షణిలా..**

కాకినాడ నగరపాలక సంస్థ సహకారంతో జన్మభూమి పార్కులో బోన్సాయ్ మొక్కల సంరక్షణకు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవికాలంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో స్ప్రింకర్ల ద్వారా మొక్కలకు వాటరింగ్ చేస్తారు. మిగిలినకాలంలో రోజుకు ఒకసారి మాత్రమే మొక్కలకు పడతారు. ఎండ ఎక్కువగా తగలకుండా మొక్కలు చుట్టూ గ్రీన్‌మేట్ అమర్చారు. బయట వాతావరణ పరిస్థితులు కంటే బోన్సాయ్ మొక్కలకు వాతావరణ పరిస్థితులను కొంచెం చల్లగా ఉండాలి. తెగుళ్లు రాకుండా శీతాకాలంలో వేపనూనె కలిపిన కెమికల్స్ స్ప్రే చేస్తారు. మిగిలిన రోజుల్లో న్యూట్రిషనల్ స్ప్రే చేస్తారు. 1:1:1 రేషియోలో మట్టి, వర్మికంపోస్టు, కొబ్బరి పీచు వేస్తుంటారు. తద్వారా మొక్కలు నీరు తీసుకోవడంలో సమతుల్యత ఉంటుంది. బోన్సాయ్ మొక్కల నిర్వహణ చాలా జాగ్రత్తగా చూసుకోకపోతే మొక్కలు చనిపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల వీటి నిర్వహణపట్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.




**పైకి ఎగిరిపోతూ..**



కాకినాడ జిల్లా గొల్లప్రోలు జాతీయ రహదారి పక్కన దమ్ము పొలాల్లో కనువిందు చేస్తున్న కొంగలు

**గాల్లో తేలిపోతూ..**



# ఎగిరిపోతే...!

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్/కాకినాడ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరినాట్లు, దమ్ములు జోరుగా సాగుతున్నాయి. పొలాల్లో వరి నాట్లు వేసేందుకు ట్రాక్టర్లతో రైతులు దమ్ములు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోకి వస్తున్న కొంగలు కనువిందు చేస్తున్నాయి. దమ్ము చేలను చుట్టుముడుతూ.. పైకి ఎగురుతూ.. గాల్లో తేలుతూ.. వీనుల విందు చేస్తున్నాయి. పొలాల్లో వాటికి దొరికే ఆహారం కోసం వచ్చే ఈ కొంగలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం మీరు మీదగ్గర్లో ఉండే దమ్ము పొలాల్లో వెళ్లి చూస్తే ఇలాంటి కొంగలు ఎగురుతూ.. కనిపిస్తాయి.. వెళ్లి చూసేయండి మరి..!

**పొలాన్ని చుట్టుముడుతూ..**



కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని పొలాల్లో ట్రాక్టర్లు దమ్ము చేస్తుండగా పురుగులు తింటున్న కొంగలు

# భక్తజన సంద్రం వాడపల్లి

## స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.39.57లక్షలు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, భాలబోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.39.57 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

### అప్పనపల్లి ఆలయంలో..



అప్పనపల్లి బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిక్కిరిసిపోయాయి. తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కిటకిటలాడింది. శనివారం పురస్కరించుకుని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం ఒక్కరోజు రికార్డు స్థాయిలో 9200 మంది భక్తులు దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో 5200 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,88,506 ఆదాయంగా సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



తిరుపతి శృంగారవల్లభస్వామి

## శృంగారవల్లభస్వామికి భక్తుల రద్దీ

పెద్దాపురం, .జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించు కున్నా రు. తెల్లవారు జామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,00,920, అన్నదాన విరాళాలు రూ.87,090 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,800, తులాభారం, కానుకలు ద్వారా రూ.950, వెరసి రూ. 2,94,760 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు ఆరువేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బ్రాహ్మణ క్రికెట్ పోటీలు ప్రారంభం

## పోటీలో తలపడుతున్న 20 జట్లు

అమలాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అక్షింతలు పట్టుకునే చేతులతో క్రికెట్ బ్యాట్‌లు, బాల్స్ పట్టుకున్నారు. కూర్చొని కల్యాణ క్రతువులు నిర్వహించే పురోహిత బ్రాహ్మణులు గ్రౌండ్‌లో పరుగులు తీశారు. అమలాపురం కిమ్స్ వైద్యకళాశాల క్రీడా ప్రాంగణంలో కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో రెండోసారి రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం ప్రారంభించారు. పంచకట్టుతో వచ్చిన బ్రాహ్మణ పురోహితులకు ఉపద్రష్ట కృష్ణమూర్తి పేరిట క్రీడా దుస్తులను అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి అందజేశారు. క్రీడా ట్రోఫీలను ఆవిష్కరించి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను టాస్‌వేసి ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. పురోహితులకు ఆట విడుపుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. క్రికెట్ క్లబ్ ప్రతినిధులు ఉపద్రష్ట విజయాదిత్య, పెద్దింటి అక్షయ్, కర్రా బాబీ, ఉపద్రష్ట నాగార్జున, ఆకొండి పవన్, మహేంద్రాదిత్య, గండికోట సాయిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. తొలిరోజు విజయవాడ-అన్నవరం జట్లు తలపడగా అన్నవరం జట్టు విజేతగా నిలిచింది. కాకినాడ రుద్రాస్-రాజమహేంద్రవరం జట్లు తలపడగా కాకినాడ రుద్రాస్ విజేతగా నిలిచింది. కాకినాడ-2 శరవణభవ జట్టు నర్సీపట్నం జట్టుతో తలపడగా నర్సీపట్నం జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 20 జట్లు వచ్చినట్టు ఉపద్రష్ట నాగాదిత్య, అనప్పిండి నర్సింహమూర్తి తెలిపారు. ఖమ్మం, మోపిదేవి, గుంటూరు, వైజాగ్, భీమవరం, నందిగామ, తాడేపల్లిగూడెం తదితర జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని వివరించారు. ప్రారంభోత్సవ కిమ్స్ రఘు, నేతాజీ, కడియాల శ్రీను పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత పరిషత్ క్రికెట్ టోర్నమెంట్‌ను టాస్‌వేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

# వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



విజయదుర్గా పీఠంలో వేంకటేశ్వరస్వామి కల్యాణంను తిలకిస్తున్న పీఠాధిపతి గాడ్

రాయవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 89వ జన్మదిన వేడుకల్లో భాగంగా రెండోరోజు శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం పీఠంలో వైభవంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీనివాస గోవింద..శ్రీవెంకటేశా గోవిందా.. అంటూ భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపారు. వైఖానస ఆగమం ప్రకారం జరిగిన కార్యక్రమంలో తొలుతగా పీఠంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ కార్యక్రమంలో భాగంగా విష్వక్షేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, సజ్జు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, మధుపర్క సమర్పణ, కన్యాదానం, మాంగళ్యపూజ, మాంగళ్యదారణ, తలంబ్రాలు కార్యక్రమాలతో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించి హోమం, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం వేంకటేశ్వరస్వామికి సహస్రనామాలతో కుంకుమార్చనలు నిర్వహించి అర్చక స్వాములు శ్రీనివాసుని కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ ప్రత్యక్షదైవం శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకించడంవల్ల సఖలశుభాలు కలుగుతాయన్నారు. ప్రవచనకర్త డాక్టర్ గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీనివాస కల్యాణాన్ని వివరిస్తూ చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకుంది. కల్యాణం అనంతరం వేదపండితులు పీఠాధిపతి గాడ్‌కు శ్రీనివాసుని ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు గాడ్ ఆశీస్సులు అందుకున్నారు.

## స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1.84లక్షలు

కొత్తపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,84,912 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# బాస్కెట్‌బాల్ టోర్నీ విజేతలకు ట్రోఫీలు అందజేత

## ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నమెంటు పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి18 (ఆంధ్రజ్యోతి):బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఈస్ట్‌గోదావరి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడాప్రాంగణంలో మూడురోజుల పాటు 14వ ఆలిండియా, 20 ఏపీ బాస్కెట్‌బాల్ టోర్నమెంటు పోటీలు శుక్రవారం అర్ధరాత్రితో ముగిశాయి. బాస్కెట్‌బాల్ టోర్నీ పురుషుల జట్టు విజేత సీఆర్‌పీఎఫ్ చండీఘర్ జట్టుకు రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ ట్రోఫీ అందజేశారు. బాస్కెట్‌బాల్ టోర్నీ మహిళలజట్టు విజేత ఎస్ఆర్ఎం చెన్నై జట్టుకు పారిశ్రామికవేత్త అడ్డూరి సంతోష్ వర్మ ట్రోఫీ అందజేశారు. రన్నరప్ జట్టు పటేల్ అకాడమీ చత్తీస్‌గడ్ జట్టుకు డా.కోటసతీష్‌కుమార్, రన్నరప్ పురుషుల జట్టుకు చిత్తూరు జట్టుకు మాజీ ఏఎంసీ ఛైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, మూడవ స్థానం పొందిన రామచంద్రపురం మహిళలు, సెంట్రల్ టాక్స్ హైదరాబాద్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ట్రోఫీ ప్రధానోత్సవ సమావేశంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, డా.చెలికాని రామారావు, మాజీ క్రీడాకారులు, టీడీపీ నాయకులు అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన నాయకుడు గొల్లపల్లి కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.




టోర్నీవిజేత సీఆర్‌పీఎఫ్ చండీఘర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ స్టాలిన్




టోర్నీ విజేత ఎస్ఆర్ఎం చెన్నై జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అడ్డూరి సంతోష్ వర్మ

# సందేశమిస్తూ.. సామాజిక అంశాలను స్పృశిస్తూ

## భోగాపురంలో ఆకట్టుకుంటున్న జాతీయస్థాయి నాటిక పోటీలు


అసత్యం నాటికలోని ఓ సన్నివేశం


ఇది రహదారి కాదు నాటికలోని ఓ సన్నివేశం

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు లక్షల్లో సంపాదిస్తూ పిల్లలు కనకపోవడం, దానికి డింక్ (డబుల్ ఇన్‌కమ్ నో కిడ్స్) అని పేరు పెట్టడం ఏ సంస్కృతి. ఇందుకోసం మాతృత్వాన్ని పణంగా పెట్టడం తగదు అంటూ సందేశాన్ని ఇస్తూ, అదే సమయంలో పలు సామాజిక అంశాలను స్పృశిస్తూ ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో భాగంగా రెండోరోజు 3 నాటికలను ప్రదర్శించారు. నేటి యువతరం ప్రయాణిస్తున్న పెడ ధోరణులను వివరిస్తూ వారిని సరైన మార్గంలో పెట్టాలని హైదరాబాదు మిత్ర క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన ఇది రహదారి కాదు నాటిక చాటిచెప్పింది. మన దేశంలో కావాల్సినంత స్వేచ్ఛ ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలి తప్ప వక్రమార్గం పట్టించవద్దని, పిల్లలను కనబోమని చెబుతూ దానికి వింత పేర్లు పెట్టుకోవడం తగదని హితవు పలికారు. పంది కూడా తన పిల్లలను సంరక్షించుకోవడానికి ఎంతకైనా తెగిస్తుందని, అటువంటి పవిత్రమైన మానవ జన్మ పొందిన మనం పిల్లలు లేకుండా చేసుకుంటారా అని ప్రశ్నించారు. దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ గ్రాండ్‌మాస్టర్‌ను అందించిన తల్లి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెబుతూ దారి తప్పిన ఒక యువజంటను చక్కదిద్దిన విషయాన్ని ఈ నాటికలో ప్రదర్శించారు. ఆకురాత్రి భాస్కరచంద్ర ఈ నాటికను రచించగా, ఎస్ఎం భాషా దర్శకత్వం వహించారు.

### జీవితం ఒక రంగస్థలం

జీవితం ఒక రంగస్థలమని, ఇందులో అందరు నటీనటులేనని, ఎవరి పాత్ర వారి పోషించి అదృశ్యమవుతారని, ఆ పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసే వారే మహానటులని విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఆంగీకం భువనం యస్య నాటిక ద్వారా తెలియజేశారు. ఆర్థిక అంశాలతో ముడిపడిపోతున్న జీవితాల్లో ప్రేమానురాగాలకు స్థానం ఉండదని, తాను బాధపడుతూ, ప్రాణాపాయస్థితికి చేరిన తన వద్ద డబ్బును భర్తకు అందించడం, వైద్యులు వారిస్తున్నా నాటక ప్రదర్శనలో పాల్గొని స్వర్ణ కమలం సాధించి అదే వేదికపై ఒరిగిపోయిన ఒక కళాకారిణి ఇతివృత్తాన్ని ప్రదర్శించారు. అనంత హృదయరాజు ఈ నాటికను రచించగా, వేంపాటి రమేష్ దర్శకత్వం వహించారు.

కంటికి కనిపించేది అంతా సత్యం కాదు, కనిపించనది అసత్యం కాదని విశాఖ ఉక్కునగరానికి చెందిన చైతన్య కళాస్రవంతి కళాకారులు తాము ప్రదర్శించిన అసత్యం నాటిక ద్వారా వివరించారు. యదార్థమైనా సరే చెడుకు దోహదపడితే అది అసత్యం, అబద్ధమైనా అది మంచికి ఉపయోగపడితే అది సత్యమని చాటిచెబుతారు. మోదుగు శ్రీసుధ రచించిన కథను పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరణ చేయగా, పి.బాలాజీనాయక్ దర్శకత్వం వహించారు.

### వారాహి పురస్కారం అందజేత

ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు సీహెచ్.మహేష్‌కు వారాహి విశిష్ట రంగస్థల ప్రతిభా పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు,కళాకారులు పాల్గొన్నారు.


దర్శకుడు మహేష్‌కు వారాహి విశిష్ట రంగస్థల ప్రతిభా పురస్కారం అందజేస్తున్న దృశ్యం

# చెస్‌తో మేధాశక్తి పెంపుదల

- ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ అర్బిటర్స్ కమిషన్ చైర్మన్ రాజేష్
- 'శ్రీప్రకాష్'లో రెండో రోజు జాతీయస్థాయి చెస్ పోటీలు



రాజేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం


చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పెద్దాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మేధాశక్తి పెంపొందించేందుకు చెస్ దోహద పడుతుందని ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ అర్బిటర్స్ కమిషన్ చైర్మన్ ఆర్.రాజేష్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి స్కూల్ చెస్ చాంపి యన్ షిప్ పోటీల్లో భాగంగా రెండవ రోజు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చెస్‌లో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీప్రకాష్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు తమలోని దాగి ఉన్న మేధా శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు.పోటీలను తిలకించి క్రీడాకారులకు మెళకువలను నేర్పించారు. కార్య క్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీశర్మ, కార్యదర్శి ఏసీపీ అడుసుమిల్లి, అనంతరామ్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్. విజయ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా 'నవోదయ' ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. ప్రవేశ పరీక్ష కోసం 8971 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6499 మంది విద్యార్థులు హాజరయ్యారని, 2472 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు...

## రూ.11 వేల కోట్ల ప్యాకేజీ హర్షణీయం

ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సమస్యను ఎప్పటికప్పుడు లేఖల ద్వారా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనేకసార్లు కార్మికులను కేంద్రమంత్రి కుమారస్వామి వద్దకు తీసుకెళ్లి వారి ఇబ్బందులను వివరించామని, ప్రైవేటీకరణ చేయబోమని కుమారస్వామి తమకు ధైర్యం చెప్పారని తెలిపారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఉండడం వల్లే ఆశించిన కల సాకారమైందన్నారు.



ఫిబ్రవరి 4 నుంచి అంతర్వేదిలో...

# శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

- అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలి
- ముందస్తు ఏర్పాట్లపై కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి అధికారులతో కల్యాణోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 4న రథసప్తమి నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభమై 10 రోజుల పాటు గ్రామోత్సవం, స్వామివారి దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. 5వ తేదీన గరుడ పుష్పక వాహనంపై మాడవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం, 6న హంస వాహనం, 7న గజమాల అలంకరణ కార్యక్రమం అనంతరం రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు స్వామివారి తిరు కల్యాణోత్సవం, భద్రాద్రి రాములోరి కల్యాణం మాదిరిగా ఆరుబయట ప్రాంగణంలో వైభవంగా జరుగుతుందన్నారు. అనంతరం భక్తులు శిఖర దర్శనం చేసుకుంటారని ఆయన తెలిపారు.

### 12ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు

స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా 12ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కవరేజ్ కోసం ప్రత్యేక కంపార్టుమెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయంలో వీఐపీ, శీఘ్ర సాధారణ దర్శనాల కోసం మూడు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 8న అక్షింతల సేకరణ పంపిణీ కార్యక్రమాలు, స్వామివారి రథోత్సవం జరుగుతుంది. 9, 10, 11 తేదీల్లో స్వామివారి గ్రామోత్సవాలు, దర్శన కార్యక్రమాలు యథావిధిగా ఉంటాయి. 12న స్వామివారి చక్రవారీ సముద్రస్నానం, ఉదయం 8 గంటల నుంచి సంప్రోక్షణ, స్వామి అర్చన కార్యక్రమాలు, వేద పురోహితులు నిర్వహిస్తారు. 13న నదీ విహారంలో మూడు రౌండ్లుగా తెప్పోత్సవం కార్యక్రమం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తారు. ఆర్టీసీ అధికారులు భక్తుల సౌకర్యార్థం దేవాలయం వరకు బస్సులు నడిపే అవకాశాలపై ప్రాథమిక సర్వే నిర్వహించాలని ఆర్అండ్‌బీ, ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్నానఘట్టాల వద్ద భక్తుల భద్రత కోసం మత్స్యశాఖ ఆధ్వర్యంలో నాలుగు రెస్క్యూ బోట్లు, వంద మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక పోలీసులు మెరైన్ పోలీసులను సమన్వయం చేసుకుని భక్తుల శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు దేవస్థానం బయట బారీకేడింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీర్లు అంతర్గత రోడ్ల నిర్మాణం, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కంట్రోల్ రూముకు అనుసంధానం చేయాలని కలెక్టర్ తెలిపారు.

### నిరంతరం విద్యుత్ సరఫరా

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, లైటింగ్‌ను భక్తులు సంచరించే రహదారి పొడవునా ఏర్పాటు చేయాలన్నారు. దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూము నుంచి భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 60 తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు తాగునీటి వసతి సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలన్నారు. డీపీవో ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను నియమించి సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. రథోత్సవానికి వీలుగా మాడవీధుల్లో తొలగించిన విద్యుత్ వైర్లను రథోత్సవం ముగిసిన తరువాత తిరిగి పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐదు ప్రాథమిక వైద్య శిబిరాలు, అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలన్నారు. అబ్కారీ అధికారులు పది రోజుల పాటు మద్యం షాపులను మూసివేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ స్వామివారి కల్యాణం, తెప్పోత్సవం, సముద్ర స్నానఘట్టాల ప్రక్రియల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అధికారులంతా పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా పాల్గొంటాయన్నారు. డీపీఆర్వో నేతృత్వంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఉత్సవాల కవరేజ్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కె.మాధవి, అదనపు ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ,జిల్లాస్థాయి అధికారులు ఉన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి


బలభద్రపురంలో మృతిచెందిన శ్రీను

బిక్కవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. గ్రామ వీఆర్వో మాచవరపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన గదుల శ్రీను (57) బలభద్రపురంలోని రామకృష్ణ ఇంజనీరింగ్ వర్క్‌షాపులో పనిచేస్తున్నాడు. వర్క్‌షాప్‌లో పని నిమిత్తం గ్రామంలో వేరే చోటకు వెళ్లి తిరిగి మోటార్‌సైకిల్‌పై శ్రీను వస్తుండగా దేవి సెంటర్‌లోని గుబ్బాలమ్మ గుడి వద్ద వెనుక నుంచి కొమరిపాలెం మురళీమోహన రైస్‌మిల్లుకు చెందిన లారీ ఢీకొనడంతో సిమ్మెంట్‌రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలు కాగా అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసులకు వీఆర్వో సమాచారం అందించారు.

## 'మెడికల్ కాలేజీ సీట్ల సర్దుబాటు విధానం మార్చుకోండి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కాలేజీ సీట్లు విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులే కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకరులతో మాట్లాడారు. సీట్లు సర్దుబాటు విధానం మార్చుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లోపభూయిష్టంగా ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హర్షకుమార్ తనయుడు జీవీ.సుందర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రులైన ఓటర్ల సమగ్ర డేటాను కూటమి అభ్యర్థి తస్కరించారని, దీనిపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి కర్ణాటక సంగీత గాత్ర, వీణా వాయిద్య పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వాత్ సభ 77వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ సూర్యకళామందిరంలో ఈనెల 19 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయి కర్ణాటక సంగీత గాత్ర, వీణా వాయిద్య పోటీలు నిర్వహిస్తున్నారు. 19న ఉదయం 9గంటల నుంచి నిర్వహించే పోటీల్లో 16 ఏళ్లలోపు బాల బాలికలు జూనియర్లు గాను, 17ఏళ్ల నుంచి 26ఏళ్ల మధ్య వారు సీనియర్లు గాను పరిగణిస్తామని నిర్వాహకులు తెలిపారు.

జూనియర్ల విభాగం పోటీల్లో పాల్గొనేవారు ఆది తాళవర్ణం రెండో తాళంలో పాడాలి.. వాయించాలి. మూర్తిత్రయం కృతుల్లో కనీసం ఇద్దరి కృతులు, పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్‌వారి కృతి అందజేసి అందులో న్యాయ నిర్ణేతలు కోరిన కృతిని పాడి, వాయిం చాల్సి ఉంది.

సీనియర్ల విభాగంలో ఆది తాళవర్ణం రెండో తాళంలో పాడాలి, వాయించాలి. మూర్తిత్రయం కృతుల్లో కనీసం ఇద్దరి కృతులు, పట్నం సుబ్రహ్మణ్యం అయ్య వారి కృతి అందజేసి అందులో న్యాయనిర్ణేతలు కోరిన కృతిని పాడి,వాయించాలి. రాగం నెరవల్, స్వరం చేయడం తప్పనిసరి.

### బహుమతులు ఇలా...

గాత్ర విభాగంలో సీనియర్లకు ప్రథమ బహుమతి రూ.4వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు. జూనియర్ల విభాగంలో ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యి. వీణ విభాగంలో సీనియర్లకు ప్రథమ బహుమతి రూ.4వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు, జూనియర్ల విభాగంలో ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యిగా ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.

## పీసా చట్టంపై శిక్షణా తరగతులు

సామర్లకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ ఆవరణలో నిర్వహిస్తున్న 2రోజుల శిక్షణా తరగతులను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. కేంద్రం ఆవరణలో శనివారం పీసా చట్టంపై మొదటి బ్యాచ్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు 5 జిల్లాలకు సంబంధించి సుమారు 108మంది హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందించేందుకు ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని, ఇక్కడ శిక్షణ పొందిన ఎంపీటీలు క్షేత్రస్థాయిలో కింది స్థాయి అధికారులకు ఇవ్వాల్సిఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాయింట్ డైరక్టర్ శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ రామనాథం పలు అంశాలపై సమగ్రంగా వివరించారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంపీటీలు ఏజెన్సీ ప్రాంతాల అధికారులకు ఫిబ్రవరి, మార్చిలో 2 రోజుల శిక్షణా తరగతులు ఇవ్వాల్సి ఉందన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఎం.చక్రపాణీరావు, వి.ప్రసాద్, నీహారిక, డీఆర్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్



కానిస్టేబుల్ అభ్యర్థులకు

# ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పందెంలో పురుష అభ్యర్థులు

కాకినాడ క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా జరుగుతున్న పురుష, మహిళల దేహదారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్‌లో 630 కానిస్టేబుళ్లు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 381 సివిల్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకిగాను జరిగిన ఈ ఎంపిక ప్రక్రియకు 6,333మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 4993మంది హాజరై 2857మంది అర్హత సాధించారు. 1,449 మంది మహిళా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1066మంది హాజరై 472మంది అర్హత సాధించారు. మొత్తంగా కలిపి 7,782మంది హాజరుకావాల్సి ఉండగా 6059 మంది హాజరై 3329మంది అర్హత సాధించారు. గతనెల 30న ప్రారంభమైన ఈ దేహదారుఢ్య పరీక్షలు ముగిశాయి. శనివారం పురుష, మహిళా అభ్యర్థులు కలిసి మొత్తం 564 మంది హాజరు కాగా తదుపరి పరీక్షకు 318మంది అర్హత సాధించారు. పరీక్షలను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావ్ పర్యవేక్షించారు.


మహిళల ఎత్తు పరిశీలిస్తున్న దృశ్యం

## కబడ్డీ పోటీలకు రిఫరీల ఎంపిక


రిఫరీలను అభినందిస్తున్న డీఈవో రమేష్

సామర్లకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖాండ్‌లో ఈనెల 28 నుంచి జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కాకినాడ జిల్లాకు సామర్లకోటకు చెందిన బోగిళ్ళ మురళీకుమార్, గుడారి గుంట పీడీ ఎం.శ్రీనివాసకుమార్‌ను ఎంపిక చేస్తూ జాతీయ స్థాయి క్రీడా మండలి నుంచి ఉత్తర్వులు రావడంతో శనివారం వారిని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అభినందించారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి ప్రోకబడ్డీ పోటీలకు న్యాయ నిర్ణేతగా మురళీకుమార్ పలు దఫాలు హాజరైన విషయం విధితమే. జాతీయస్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీలకు కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లు ఎంపిక కావడం జిల్లాకే ఎంతో గర్వకారణం అని డీఈవో అభినందించారు. వారిని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు విక్టరీ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

## గణతంత్ర వేడుకలకు 'ముక్కామల' బృందం


బృంద సభ్యులు

అంబాజీపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఏపీ శకటం వద్ద ప్రదర్శన ఇచ్చేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల పుసపులేటి నాగబాబు, కుమార్‌ల కళాకారుల బృందం 16మంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ నెల 12న ఢిల్లీ చేరుకుని రీహార్సల్స్ చేస్తున్నారు. 26న ఏపీ కొప్పాక బొమ్మల ఆంధ్రప్రదేశ్ శకటాన్ని ఏపీ తరుపున ఢిల్లీలో ప్రదర్శించనున్నారు. ఢిల్లీలో నాగబాబు బృందానికి మూడోసారి ఏపీ తరుపున ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం దక్కింది. 2003లో జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల థీమ్‌ను ప్రదర్శించిన సమయంలో నాగబాబు బృందం ఆకట్టుకుంది. కోనసీమ ప్రభల థీమ్‌ను ఢిల్లీలో జరిగిన పరేడ్‌లో ప్రదర్శించి ప్రతిభ కనబరిచారు. మరోసారి ఐఅండ్‌పీఆర్ జేడీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 26న జరిగే ప్రదర్శనలో పాల్గొనడం పట్ల నాగబాబు బృందం కృతజ్ఞతలు తెలిపారు.

## ఖైదీల న్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు పరిశీలన**

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలతో మాట్లాడారు. వారి సమస్యలను ఆరా తీసారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మోడల్ ప్రిజన్స్ మాన్యువల్, 2016లోని 29వ అధ్యాయం ప్రకారం జైలు అధికారులకు జారీ చేసిన అన్ని విషయాలు, నిబంధనలు ఆదేశాల ప్రకారం కుల, మత, లింగ వివక్ష లేకుండా ఖైదీలను చూడడం, నిబంధనలు అమలు పరిశీలన కోసం జైలును సందర్శించామన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, బోర్డు ఆఫ్ విజిటర్స్‌లతో కలిసి జైలును పరిశీలించారు. ఖైదీల తరపున న్యాయవాది లేకపోతే డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఎలాంటి న్యాయసమస్యలు ఉన్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా గానీ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ ద్వారా గాని సంస్థకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామమూర్తి, అడిషనల్ ఎస్పీ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి, డీఈవో, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ అధికారి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ప్రభుత్వం భరోసా


పరిహారం అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, ఆర్డీవో కృష్ణనాయక్

**ఎమ్మెల్యే గోరంట్ల**

కడియం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి భరోసా ఇచ్చారు. మండలంలోని బుర్రిలంక గ్రామంలో హత్యాచారానికి గురైన మహిళ భర్త పాపారావుకు ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల పరిహారం, దోసాలమ్మ కాలనీలో సెంటున్నర స్థలం పట్టా, రూ.1.25 లక్షల నగదును ఆర్డీవో కృష్ణనాయక్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల శనివారం అందజేశారు. నివేశన స్థలంలో ఐఏవై పథకంలో ఇంటి నిర్మాణానికి కూడా సహకారం అందిస్తామన్నారు. దివ్యాంగురాలైన కుమార్తెకు వచ్చే నెల నుంచి రూ.6 వేల పెన్షన్ కూడా అందజేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, గట్టి నర్సయ్య, పాటంశెట్టి రాంజీ, వెలుగుబంటి నాని, గట్టి సుబ్బారావు, చెల్లుబోయిన శ్రీను, ముద్రగడ జమీ, పంతం గణపతి పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించండి

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వినతి**

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలకు పైబడి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న తమను కనీసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానైనా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కలిసి వినతిపత్రం అందించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చంద్రబాబు రెండు సార్లు తమ జీవన భృతిని పెంచారని అటుపై తమను పట్టించుకునేవారేలేరన్నారు. విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మిడ్డే మీల్స్ వర్కర్లు సీహెచ్ వసుంధర, జి.శ్రీదుర్గామల్లేశ్వరి, ఆర్.మంగ, జి.వెంకటరమణమ్మ, పి.సుబ్బలక్ష్మి, పి.వెంకటలక్ష్మి, జి.కృష్ణవేణి, ఎన్.సత్యవతి పాల్గొన్నారు.

## వాహన యజమానులు, డ్రైవర్లకు కంటి పరీక్షలు

**జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మెడికల్ క్యాంపు**

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025లో భాగంగా శనివారం రాజమహేంద్రవరంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయం ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. రాజమండ్రి లారీ ఓనర్స్ అసోసియేషన్, ది రాజమండ్రి మినీ గూడ్స్ వెహికల్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, వాహనయజమానులు, డ్రైవర్లకు ఆరోగ్యం, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్.సంపత్‌కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారాయణ్, కె.చైతన్య సుమ, జి.రాధికాదేవి, పీవీవీ సాయికుమార్, రోడ్ సేఫ్టీ డాక్టర్ పి.మాధురిదేవి, జీజీహెచ్, డివైన్ ఐ ఫౌండేషన్ యోగానంద ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. సీతారాంపురంలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో డీఏవో ముఖ్య అతిథిగా విచ్చేసి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పొగాకు సాగును తగ్గించి మొక్కజొన్న, అపరాలు పంటలను సాగు చేయాలని సూచించారు. ఏక పంట కాకుండా పంటల మార్పిడి చేసుకోవాలని, దీని వల్ల తెగుళ్లు, చీడ పీడల ఉధృతి తగ్గి అధిక దిగుబడులు, ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ డి.శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎస్.కె.ఇమామి ఖాసిం, వీఏఏ సుబ్బలక్ష్మి, ధర్మరాజు, వీరబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 'సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి'

బిక్కవోలు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులు సామూహిక ఎలుకల నివారణ మందును వినియోగించినప్పుడే ఎలుకల నివారణ సాధ్యపడుతుందని మండల వ్యవసాయ విస్తరణాధికారి కేవీ భాస్కరరెడ్డి తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో శనివారం ఎలుకల నివారణ మందును రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలుకల వల్ల 20 శాతం పంట నష్టం వుంటుందని, రైతులందరూ వీటి పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. పందలపాకలో కూటమి నేతలు పడాల వెంకటరామారెడ్డి, అనుసూరి నాగేశ్వరరావు, బలభద్రపురంలో సర్పంచ్ బుంగా రామారావు, నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, ఊలపల్లిలో తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి రైతులకు ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు.

## బాల్య వివాహాలు నేరం

బిక్కవోలు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ వి.శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కిషోరి వికాశం కార్యక్రమంపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా వార్డు మెంబర్లు, అంగన్వాడీ సిబ్బందికి ఒక రోజు శిక్షణ నిర్వహించారు. దీన్ని ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, మండల ప్రత్యేకాధికారి జ్యోతి ప్రారంభించి, బాల్య వివాహాలు, బాలల హక్కులు, ఫోక్స్ చట్టంపై తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యకృష్ణ, ఈఓపీఆర్‌డీ జాన్‌మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

### త్యాగరాజస్వామి జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 18(ఆంధ్రజ్యోతి): గౌతమి ఘాట్ వద్ద గల త్యాగరాజస్వామి మందిరంలో శనివారం ఆరాధనోత్సవం చేశారు. త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా కమ్యూనిటీ హాల్‌లో త్యాగరాజ స్వామికి పూలమాలలు వేశారు. రామవరపు సహదేవుడు, నాగమణిల నాదస్వర బృందంచే క్లారినెట్ కచేరీ, వాడపల్లి వినాయక రావు నాదస్వర బృందం స్వామివారి కీర్తనలు ఆలపించారు.

### పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 163వ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లను పంపిణీ చేశారు. నగరపాలక సంస్థలో పనిచేసే 163 మంది కార్మికులకు నిత్యావసరాలను అందజేశారు. స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ పర్యవేక్షించారు.

### గౌతమి నేత్రాలయాన్ని సందర్శించిన పనోరమా ఎడిటర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ పనోరమా (యూఎస్ఏ) ఎడిటర్ ఇన్ చీఫ్ ఇంద్రజిత్ శలూజా ఆయన సతీమణి ఎల్ కౌర్‌లు శనివారం రాజమహేంద్రవరంలో గౌతమి నేత్రాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పీఎస్ రావు, గౌతమి ఎండి వివి కుమార్, ఫిలాంత్రపిస్ట్ విక్రమ్ జైన్, డాక్టర్ శర్మ, జస్పెర్ ఏజీఎం అన్వర్, నాట్యాచార్యులు శర్మలు వారిని సత్కరించారు.

### రేపటి నుంచి పశు ఆరోగ్య ఉచిత శిబిరాలు

రంగంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు రంగంపేట మండలంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రంగంపేట మండల పశు వైద్యాధికారులు జహంగీర్, ఇ.జాన్‌పాల్ తెలిపారు. శనివారం వారు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం...జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలో 10 ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వస్తున్నామన్నారు. ఈ శిబిరాల ద్వారా పశు వైద్య చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన వంటి సేవలు అందిస్తామన్నారు. పాడి రైతులంతా ఈ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

# రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



**మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు**

# ఆదర్శప్రాయుడు


రామవరంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

- ఊరువాడా వర్ధంతి
- కోటి సభ్యత్వాలతో ఎన్టీఆర్‌కు ఘన నివాళులు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- పలువురు నాయకుల నివాళి

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు జీవితం ఎందరికో ఆదర్శం అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాల నమోదు చేయించి ఎన్టీఆర్‌కు ఘనమైన నివాళులర్పించారన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని రాజమహేంద్రవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ దేశంలోనే సంస్కరణలకు, సంక్షేమానికి ఆద్యుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నలుదిశలా చాటిన మహనీయుడని, ఆయన బాటలోనే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముందుకు సాగుతున్నారన్నారు. ఈ రోజు కోటి సభ్యత్వాలను టీడీపీ పూర్తిచేసుకోవడమే ఎన్టీఆర్‌కు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అన్నారు. జీజీహెచ్ (ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి) వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీజీహెచ్ ఆవరణలోని అన్నక్యాంటీన్‌లో పేదలకు ఉచితంగా భోజనం అందజేశారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆర్ట్స్ కళాశాల గేటు సెంటర్‌లో, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ శ్రీరాంనగర్‌లో, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు కోటిపల్లి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, బీసీ సంఘం అధ్యక్షుడు గుత్తుల సుబ్రహ్మణ్యం, ఉప్పిడి గంగాధరరావు, బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

**రాజానగరం:** రాజానగరం పరిధిలోని సూర్యారావుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని, ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలన్నారు. అలాగే మండలంలోని చక్ర ద్వారబంధం, పరిజెల్లిపేట, కానవరం, పల్లకడియం, మల్లంపూడి, తోకాడ, రాధేయపాలెం, నరేంద్రపురం, వెలుగుబంద, నందరాడ, కలవచర్ల, సీతారాంపురం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో వంక మల్లికార్జునరావు, బచ్చు ప్రసాద్, దాసరి శ్రీను, చిట్టిప్రోలు పద్దరాజు, ఖండవల్లి లక్ష్మి, మల్లిడి త్రినాధ్‌రెడ్డి, కంటే దొరబాబు, లంజపల్లి బాపిరాజు పాల్గొన్నారు.

**బిక్కవోలు:** మండలంలోని తొస్సిపూడి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి కొమరిపాలెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. పడాల రాము, కర్రి శ్రీనివాసరావు, పడాల చినబుజ్జి, కొవ్వూరి గోవిందరెడ్డి పాల్గొన్నారు. బిక్కవోలులో పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, వైదాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోను, పందలపాకలో పడాల సూర్యనారాయణరెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, ఊలపల్లిలో తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, ఆరికరేవులలో రెడ్డి శ్రీను, ఇళ్లపల్లిలో తనుకు శ్రీధర్, రంగాపురంలో నడింపిల్లి చిరంజీవిరాజు, కనుమూరి సాయిరాజు, ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.

**రంగంపేట:** మండలంలోని వడిశలేరు, రంగంపేట గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమం లో వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, ఉండవిల్లి గిరిబాబు, యలమాటి రాంబాబు, కొమ్మన రాంబాబు, బలిరెడ్డి దుర్గారావు, గారపాటి రాం బాబు, పోతుల చిన్నికాపు పాల్గొన్నారు.

**అనపర్తి:** మండలంలోని రామవరం, పొలమూరు, చిన పొలమూరు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావమే పేదల సంక్షేమం కోసమని, ఎన్టీఆర్ నుంచి నేడు చంద్రబాబు వరకు తెలుగుదేశం పాలనలోనే పేదలు ఆనందంగా జీవిస్తున్నారన్నారు. పీరా రామచంద్రపురంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, కొప్పవరంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, కర్రి శేషారత్నం, మల్లిడి కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు. కాగా అనపర్తి ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు ఆకుకూరలను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కోరుకొండ:** కోరుకొండలోని అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని..ఒక వ్యవస్థ అని అన్నారు. ప్రజాహిత పాలనకు తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, జాతీయ రాజకీయాలకు సరికొత్త దిశానిర్దేశం చేశారన్నారు. మహిళలకు ఆస్తి హక్కు, బీసీలకు రిజర్వేషన్లు, రూ.2కే కిలో బియ్యం వంటి పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, అడపా శ్రీనివాస్, మేడిశెట్టి శివరాం, ముక్కా రాంబాబు, టీడీపీ నాయకులు మాతా సీతారాముడు, కొయ్యాశామ్యూల్, కోర్పు బుజ్జి పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం రూరల్:** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సంక్షేమ పథకాల రూపకర్త అని టీడీపీ మండలాధ్యక్షుడు మత్స్యేటి శివసత్యప్రసాద్, మార్ని వాసుదేవరావు, గంగిన హనుమంతరావు అన్నారు. ధవళేశ్వరంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు పందూరి అప్పారావు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నీలి కోటేశ్వరరావు, ఆళ్ల ఆనందరావు, బత్తిన బ్రదర్స్, రావాడ శ్రీనివాసరెడ్డి, జ్యోతుల సత్యనారాయణ పాల్గొన్నారు. బొమ్మూరులో జరిగిన కార్యక్రమంలో కామిని ప్రసాద్, బీమరశెట్టి రమేష్, భాస్కరరావు పాల్గొన్నారు. తొర్రేడులో మన్యం నరేంద్ర, కురుకూరి కిషోర్, కొత్తపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. కొంతమూరు, కోలమూరులో జరిగిన కార్యక్రమాల్లో దండమూడి ప్రసాద్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నాగరాజు, గోకా శ్రీను పాల్గొన్నారు.

**కడియం:** తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ అన్నారు. కడియం దేవీచౌక్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని అధ్యక్షతన నివాళులర్పించారు. కార్యక్రమంలో వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వరగోగుల వెంకటేశ్వరరావు, షేక్ సిద్దయ్య, చిలుకూరి ప్రభాకర్ పాల్గొన్నారు. వేమగిరిలో జరిగిన కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీను, గుత్తుల కృష్ణ, దంగేటి సత్తిబాబు, మురమండలో జరిగిన కార్యక్రమంలో ప్రత్తిపాటి రామారావుచౌదరి, నందమూరి సూరిబాబు, దేవళ్ల రాంబాబు, పోతుల సత్యనారాయణ, దుళ్లలో జరిగిన కార్యక్రమంలో చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, కంటిపూడి శ్రీను, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు పాల్గొన్నారు.


సూర్యారావుపేటలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న బీవీఆర్ చౌదరి


కోరుకొండలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బత్తుల


ధవళేశ్వరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

### సత్యసాయి గురుకులంలో నేడు గరికపాటి ప్రవచనం



రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత వసంతాల వేడుకల్లో భాగంగా మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనాన్ని ఏర్పాటు చేశారు. ఆల్కట్ గార్డెన్స్‌లోని సత్యసాయి గురుకులంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రవచనం ప్రారంభిస్తారని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలన్నారు.

### రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాజానగరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాజానగరం తహశీల్దార్ కార్యాలయంలో రేపు నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జి.అనంత లక్ష్మి సత్యవతి దేవి కోరారు. సోమవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి.ప్రశాంతి సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

### రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కోరుకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాపవరం గ్రామ దేవత పోశాలమ్మ రథోత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శనివారం ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. రథానికి పూజలు చేసి ముందుకు లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ కాలచర్ల నాగు, జనసేన నాయకులు అడ్డాల శివ, బదిరెడ్డి దొర, మేడిశెట్టి శివరాం, టీడీపీ నాయకులు మారిశెట్టి రమణ, వల్లేపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### 'జేఎల్ఎంల సమస్యలు పరిష్కరించాలి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో జేఎల్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రస్థాయి జూనియర్ లైన్‌మన్ గ్రేడ్ -2 ఎనర్జీ అసిస్టెంట్ కోఆర్డినేషన్ సమావేశంలో సంఘ నాయకుడు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఏపీఎస్ఈబీ నిబంధనల ప్రకారం పాత పద్ధతిలో సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేసి, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రికి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు పి.రాజు, సీహెచ్ కేశవ, జీజీ సూర్యనారాయణ, ఐ.తాతాజీ, ఎం.రాము, పి.వీరబాబు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలం


రోడ్డును శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చీపురుపట్టి రహదారులను శుభ్రం చేశారు. శనివారం రాజమహేంద్రవరం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెడదామన్నారు. కార్యక్రమలో అడిషనల్ కమిషనర్, శానిటరీ సూపర్ వైజర్ తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలోని నార్త్ ఎక్సైజ్ కార్యాలయం ఆవరణంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య పర్యవేక్షణలో స్టేషన్ హౌస్ అధికారి ఆర్. త్రినాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ సి.రాజేష్, సిబ్బంది కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

**కోరుకొండ:** కోరుకొండలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ లో పాల్గొని ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోడ్లను చుట్టుప్రక్కల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధికారులు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**సీతానగరం:** స్వచ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా సీతానగరం పీహెచ్‌సీ సెంటర్‌లో వైద్యులు ఏ.వీ.కె చైతన్య, ఎస్.రాజు, ఏసురాణిల ఆధ్వర్యంలో సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం వైద్య సిబ్బంది స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వై.సుబ్బారాయుడు, సూపర్ వైజర్లు కె.సుదాకర్, జి.దైవకృప, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


కోరుకొండలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో ర్యాలీ జరుపుతున్న ఎమ్మెల్యే బత్తుల

**రాజానగరం:** స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యసాధనలో అందరూ భాగస్వాములు కావాలని రాజానగరం ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. రాజానగరంలోని సచివాలయం వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అనపర్తి:** పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం బావుంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తి దేవీ చౌక్ సెంటర్ వద్ద స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు అధికారులు, కూటమి నాయకులతో కలిసి దేవీచౌక్ నుంచి ఏరియా ఆసుపత్రి వరకు రోడ్డు ఊడ్చి ప్రజల్లో చైతన్యం నింపారు. ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, ఎంపీడీఈవో రామకృష్ణారెడ్డిలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

**ఎలుకల మందు పంపిణీ:** సామూహిక ఎలుకల నివారణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న ఎలుకల మందు పంపిణీని రామవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. సర్పంచ్ గిరిడా గంగా భవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.


అనపర్తిలో రోడ్డును ఊడుస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

### సారాతో మహిళ అరెస్ట్

రంగంపేట,జనవరి, 18 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఒక మహిళ వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు.

### మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోర వికాసం

రంగంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసు బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోర వికాసం ఎంతో ఉపయోగపడుతుందని రంగంపేట ఐసీడీఎస్ పీవో జెస్సీప్లోరెన్స్ పేర్కొన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కిశోర వికాసంపై గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలకు మండలస్థాయి శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భవితకు కిశోరి వికాసం పునాది వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిబాబు, ఈవోపీఆర్డీ పి.వెంకటరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సత్తెమ్మ గ్రామోత్సవం

బిక్కవోలు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జువ్వలదొడ్డిలో గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లి జాతరను ఆదివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు. శనివారం రాత్రి అమ్మవారి జాగరణలో భాగంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొబ్బిలి శ్రీను, మేడిశెట్టి సతీష్, దోనాదుల గంగాధరరెడ్డి, బండారు వెంకన్న, గుత్తుల సతీష్, బొబ్బిలి శివ తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

## ఇక ప్రతి నెలా మూడో శనివారం
# స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్

### ఏడాది పాటు ప్రణాళిక - కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమ నిర్వహణకు ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు.రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజీవ్ కాలనీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిరంతర పారిశుధ్య నిర్వహణలో ప్రత్యక్షంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు.ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌గా పాటిస్తామన్నారు.అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ప్రాంగణంలో పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీపీవో ఎం.నాగలత,ఎంపీడీవో శ్రీనివాసరావు,ధవళేశ్వరం సీఐ గణేష్, ఈవోపీఆర్డీ ఆర్మ్ స్ట్రాంగ్,ఆళ్ళ ఆనందరావు, సాగర్ పాల్గొన్నారు.



గోపాలపురంలో మైక్ పట్టుకుని స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్

రాజీవ్‌కాలనీలో సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## ఎన్‌టీఆర్‌కు ఘన నివాళులు

ఎన్‌టీఆర్ చిరస్మరణీయుడు.. నేటికీ ప్రజల హృదయాల్లో ఆయన స్థానం సజీవం.. ఎన్‌టీఆర్ దూరమై 29 ఏళ్లయినా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మహనీయుడు.. మహాత్ముడు.. మా దేవుడు అంటూ కొలిచారు.. ఊరూవాడా విగ్రహాలకు అభిమానులు..నాయకులు పూల దండలు వేసి నివాళులర్పించారు.. - 8లో



కొవ్వూరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు



తిరిగి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారిన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్

# తిరుగు ప్రయాణం

- ఆర్టీసీకి పెరిగిన రద్దీ
- హైదరాబాద్‌కు 13 స్పెషల్స్
- 8 షెడ్యూలు బస్సులు
- మొత్తం 21 సర్వీసులు
- రహదారులు కిటకిట
- కార్లలో తిరుగుముఖం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెద్ద పండగ ఆనందంగా ముగించుకున్న జిల్లా ప్రజానీకం తిరుగు ప్రయాణాల బాటపట్టారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాలోని స్వగ్రామాలకు వచ్చిన జనమంతా పిల్లాపాపలతో పెద్ద సంఖ్యలో తిరుగు ప్రయాణమవుతున్నారు. కొందరు రైళ్లు, బస్సులను ఆశ్రయిస్తుంటే మరి కొందరు సొంతకార్లు, ప్రైవేట్ వాహనాల్లో తిరిగి బయలుదేరారు. దీంతో శనివారం రాజమహేంద్రవరం,నిడదవోలు, కొవ్వూరు పట్టణాల్లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లు,రైల్వేస్టేషన్ ప్రాంతాలు రద్దీగా మారాయి. ప్రధానంగా జిల్లా నుంచి దూరప్రాంత ఆర్టీసీ సర్వీసులన్నీ ఫుల్‌గా వెళుతున్నాయి. శనివారం రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం ఆర్టీసీ డిపోల నుంచి 13 స్పెషల్ బస్సు సర్వీసులు హైదరాబాద్‌కు పంపించారు. వీటితో పాటు షెడ్యూలు బస్సులు మరో 8 కూడా హైదరాబాద్ వెళ్లాయి. టిక్కెట్లన్నీ గతంలోనే రిజర్వేషన్ చేసుకోవడం జరిగింది. సంక్రాంతి పండగ సమయంలోనూ ఆర్టీసీ టిక్కెట్ రేట్లు పెంచకపోవడంతో ప్రయాణీకుల నుంచి ఆర్టీసీకి మంచి డిమాండ్ పెరిగింది.

### పెరిగిన లోకల్ ట్రాఫిక్..

విజయవాడ, విశాఖపట్నం రూట్లలోనూ ట్రాఫిక్ బాగా పెరిగింది. ఈ రెండు రూట్లలోనూ జిల్లా నుంచి షెడ్యూలు బస్సులను మాత్రమే తిప్పుతున్నారు. ప్రయాణీకుల రద్దీ పెరిగితే స్పెషల్ బస్సులను తిప్పేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు.ఈ రూట్లలో అటు విశాఖపట్నం, ఇచ్ఛాపురం, విజయవాడ ప్రాంతాల నుంచి వయా రాజమహేంద్రవరం మీదుగా పెద్దసంఖ్యలోనే ఆర్టీసీ సర్వీసులు నడుస్తుంటాయి. దీని వల్ల రద్దీని బట్టి బస్సులను సర్దుబాటు చేసుకునే వీలుంటుంది. ఇక రాజమహేంద్రవరం నుంచి కాకినాడ, తుని, గోకవరం, అమలాపురం, రావులపాలెం, ఏలూరు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం తదితర లోకల్ రూట్లలోనూ ప్రయాణాలు ఊపందుకున్నాయి.

### నేడూ రద్దీ కొనసాగే అవకాశం..

స్కూళ్లు, కొన్ని ఇతర విద్యాసంస్థలకు ఆదివారం వరకూ సెలవులు ఇచ్చారు.దగ్గర ఊళ్లకు చెందిన చాలా మంది ఆదివారం ప్రయాణాలు సాగించే అవకాశం ఉంది. ప్రధానంగా లోకల్ ట్రాఫిక్ పెరగనుంది. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులను తిప్పడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.మరో పక్క హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున ఆర్టీసీ ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. జిల్లా నుంచి ఆదివారం రాత్రి 13 ప్రత్యేక బస్‌లు నడపుతున్నామని అధికారులు చెబుతున్నారు.



# బరి తెగించారు!

## కో అనడానికే..కోట్లు దండుకున్నారు..

- నేతల అనధికార అనుమతులు
- పోలీసుల రహస్య ఒప్పందాలు
- మామూళ్ల మత్తులో జోగిన వైనం
- ముందస్తుగా ఆధార్‌లు సేకరణ?
- చివరి రోజున కేసుల నమోదు
- సంక్రాంతిలో కానరాని ఖాకీలు
- యథేచ్ఛగా సాగిన పందాలు
- రూ.200 కోట్ల లావాదేవీలు
- మంత్రి ఇలాఖాలోనూ జోరుగా

నిడదవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బరి తెగించారు.. పందాల నిర్వాహకులే కాదు... పోలీసులు.. నాయకులు కూడా.. ఒకరు అనధికార అనుమతులివ్వడానికి డబ్బులు దండుకుంటే మరొకరు అడ్డురాకుండా ఉండేందుకు డబ్బులు దండుకున్నారు.. మూడు రోజులు ఏ ఒక్కరూ కిక్కురుమనలేదు.. హైకోర్టు కాదన్నా యథేచ్ఛగా పందాలు సాగాయి.. సంక్రాంతి పండుగ మూడు రోజులు పందాలతో బరులు రక్తమోడాయి. ముందు నుంచి హడావుడి చేసిన పోలీసు యంత్రాంగం పండుగ మూడు రోజులు పత్తా లేకుండా పోయారు. చివరి రోజు మాత్రం మేం పట్టుకున్నామంటూ జిల్లా వ్యాప్తంగా 338 కేసులు నమోదు చేసి 976 మందిని అరెస్టు చేశారు.పండుగ మూడు రోజులు కోడి పందాలకు లక్షలాది రూపాయలు పోలీసులు,నాయకులకు మామూళ్లు ఇచ్చినట్టు పందాల నిర్వాహకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

### పోలీసుల రహస్య ఒప్పందం..

జిల్లాలో ప్రతి ఏడాది జరిగే తంతే ఈ ఏడాది జరిగింది. కోడిపందాలకు అనుమతి లేదంటూ ముందు నుంచి పోలీసులు ప్రచారాలతో ఊదరగొట్టేశారు. నిర్వాహకులు మాత్రం ఇది షరా మామూలే అంటూ బరుల ఏర్పాటు చేసుకున్నారు. అటు నాయకులు.. ఇటు పోలీసులతో ఎవరైతే మాట్లాడుకున్నారో వాళ్ల బరులను టచ్ చేయలేదు. ఎవరైతే కలవలేదో వారిపై దృష్టి పెట్టి కొన్నిచోట్ల పేరుకు మాత్రమే బరులను ధ్వంసం చేస్తూ పందేలు వేస్తే ఊరుకునేది లేదంటూ తాటాకు చప్పుళ్లు చేశారు. భోగి ముందు రోజు వరకు ఈ తంతు సాగింది. భోగి రోజు ఉదయాన్నే బహిరంగంగా కోడిపందాలు, గుండాట, పేకాట మొదలయ్యాయి. అయినా పోలీసులకు అవేమీ కనిపించలేదు. జాతీయ రహదారుల పక్కన బరులు వేసినా అవీ కనిపించకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో సుమారు 150 నుంచి 200 వరకు బరులను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఆడేశారు.ఈ బరుల్లో భారీగా లావాదేవీలు సాగాయి.గోకవరం మండలంలో ఒక చిన్న బరికి పోలీసులు రూ.20 వేలు లంచంగా తీసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బరుల వద్ద గుండాట జోరుగా సాగింది.. బరిని బట్టి గుండాటకు వేలం వేశారు. జిల్లాలోని ఒక బరిలో అయితే రూ.10 లక్షలకు పాడుకున్నట్టు సమాచారం. బరిలో గుండాట,కోతాట, పేకాట యథేచ్ఛగా నిర్వహించారు. ఈ ఏడాది జరిగిన పందాల్లో బరికి ఇన్ని కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు ముందుగానే బరుల నిర్వాహకుల నుంచి ఆధార్ కార్డులు తీసుకున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లాలో పోలీసులు..బరుల నిర్వాహకులకు రహస్య ఒప్పందం జరిగినట్టు సమాచారం.

### జిల్లా వ్యాప్తంగా.. యథేచ్ఛగా..

జిల్లాలో ఎక్కడా పందాలు ఆగలేదు..మూడు రోజులు యథేచ్ఛగా సాగాయి.. ప్రధానంగా నిడదవోలు, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్,కొవ్వూరు, అనపర్తి, గోపాలపురం నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పందాలు సాగాయి. గోపాలపురం మండలం వేళ్ల చింతలగూడెంలో అయితే బరిని క్రికెట్ స్టేడియం తలపించేలా తీర్చిదిద్దారు. ఒక్కో బరిని బట్టి నాయకులు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా జిల్లాలో ఒక నియోజకవర్గానికి చెందిన నాయకుడు పెద్ద బరికి రూ.10 లక్షల వరకూ వసూలు చేసినట్టు ఆరోపణలు చేశారు.ఇలా జిల్లాలో కోడి పందాల బరుల నుంచి కొందరు నాయకులు పోలీసులతో పోటీపడి డబ్బులు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.



### మంత్రి ఇలాఖాలోనూ ఇంతే..

జిల్లాలోని మంత్రి దుర్గేష్ నియోజకవర్గమైన నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోనూ పెద్ద ఎత్తున బరులు వెలిశాయి.పెరవలి మండలం ఖండవల్లిలో అయితే ఒక యువకుడు గుండాటలో డబ్బులు పోగొట్టుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన విదితమే.దీనిపై కేసు నమోదు కాలేదు.ఎక్కడో శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చి ఇక్కడ గుండాట నిర్వహించినట్టు సమాచారం.నిడదవోలు పట్టణంలో కోడిపందాల బరుల విషయమై రెండు పెద్ద సామాజిక వర్గాల మధ్య నువ్వా నేనా అన్న రీతిలో వివాదం చోటు చేసుకుంది.నిడదవోలు పట్టణానికి చెందిన ఒక యువ నాయకుడు కోడిపందాల బరి ఏర్పాటుకు సిద్ధం కాగా నియోజకవర్గానికి చెందిన మరో నాయకుడు ఆ బరిని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు.ఈ వివాదంలో పట్టణానికి చెందిన యువ నాయకుడే గెలిచి భోగిరోజు ఉదయానికి బరిలో నిలిచి కోడి పందాలు ప్రారంభించాడు.ప్రస్తుతం ఆ వివాదం కాస్తా ముదిరిపాకాన పడింది.. రాజకీయ వైరంగా మారింది. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 20 వరకూ బరులు వెలసినట్టు సమాచారం. ఒక్క నిడదవోలు పట్టణం, మండలంలోనే సుమారు 13 బరులు ఏర్పాటు చేశారు. పోలీసులు నాయకుల ఒప్పందం ప్రకారమే పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేసి రూ.7,700, సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేసి రూ.4500లు నగదు స్వాధీనం చేసుకున్నారు. మంత్రి ఇలాకాలో జరిగిన కోడిపందాల్లో కోటి రూపాయలకు పైగా పందాలు జరగ్గా పోలీసులు నాయకులు ఒప్పందం ప్రకారం తూతూ మంత్రంగా కేసులు నమోదైనట్టు సమాచారం.



తాడిమళ్ల గ్రామాన్ని సందర్శించి అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## తాడిమళ్లలో రీసర్వే ఆరంభం
### పైలట్ గ్రామంగా ఎంపిక

నిడదవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రారంభించిందని.. జిల్లాలో పైలట్ గ్రామంగా తాడిమళ్లను ఎంపిక చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. నిడదవోలు మండలం తాడిమళ్లలో శనివారం కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, రైతు, భూ యజమానుల వారీగా భూముల గుర్తింపు మ్యాపింగ్ పారదర్శకంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే గ్రామాల్లో గ్రామ సభలు బహిరంగ సభలు నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా భూముల రికార్డులను రూపొందించాల్సి ఉందన్నారు. ఇందుకు 120 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పాటు ఎస్‌వోపీని రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక గ్రామం చొప్పున 16 గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఉనకరమిల్లి గ్రామంలో రోడ్డు పనులు పరిశీలించారు. ఆమె వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత,డ్వామా పీడీఎ.నాగ మహేశ్వరరావు, సర్వేల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు బి.లక్ష్మి నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

హెల్మెట్ పెట్టుకునే.. వాహనం నడపండి 8

# అక్రమాలకు.. అడ్డా!



కార్పొరేషన్ వెహికల్ యార్డ్‌లో వాహనాలు

## కార్పొరేషన్ వెహికల్ యార్డ్‌లో కనికట్టు

- అదోక మాయాప్రపంచం
- నిర్వహణకు లక్షలు ఖర్చు
- మరమ్మతుల్లో చేతివాటాలు
- గతంలో ఆయిల్ మింగుడే
- సిబ్బందిపై కమిషనర్ చర్యలు
- ఇంకనూ తేల్చని లెక్క
- గాలికొదిలేసిన విచారణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కార్పొరేషన్ వాహనాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వెహికల్‌యార్డ్ అక్రమాలకు అడ్డాగా మారింది.. ఈ యార్డ్‌లో ప్రతినెలా లక్షలాది రూపాయలు దుర్వినియోగమవుతున్నాయి.కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అండర్‌లో క్వారీ సెంటర్ నుంచి లాలాచెరువు వెళ్లే మార్గంలో ఈ వెహికల్ యార్డ్ ఉంది.దీనిలో కార్పొరేషన్‌కు చెందిన 127 వాహనాలు పార్క్ చేస్తారు.ప్రతి రోజు ఉదయం 5 గంటలకు బయటకు వెళ్లిన వాహనాలు మధ్యాహ్నం 2 గంటలకు యార్డ్‌కు చేరుకుంటాయి.గత ఐదేళ్లలో ఈ వెహికల్ యార్డ్‌లో అనేక అక్రమాలు సాగాయి. దీనిలోని వాహనాల ఇంధనానికే నెలకు సుమారు రూ.25 లక్షల పైబడి ఖర్చవుతుంది.అయినా ఇదేమిటని ప్రశ్నించిన అధికారులే లేకపోయారు.ప్రస్తుత కమిషనర్ కేతన్‌గార్గ్ మాత్రం ఆరా తీశారు. సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించారు.. అవకతవకల లెక్కను మాత్రం తేల్చడం మరిచారు.

### లక్షల్లో ఖర్చులు.. అన్నింటా తేడాలు

కార్పొరేషన్ వాహనాల మెయింటెనెన్స్‌కు సంబంధించి సమస్యను క్యాష్ చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఇన్‌చార్జిలుగా చేసేవారు గతంలో ఒక అధికారితో సమన్వయం చేసుకుని ఆయిల్ వినియోగంలో వాహనాలిచ్చే మైలేజ్‌ను తేడా చూపించి ఆయిల్ బిల్లులు నొక్కేసేవారు. వాహనాల ఆయిల్‌కి నెలకు రూ.18 లక్షల వరకు వినియోగం చూపించారు. వాహనాలను ఇష్టానుసారం వాడేవారు. ఎలా అంటే కార్పొరేషన్ వాహనాలు నగరపరిధి దాటి వేరొక ప్రాంతంలో కూడా కనిపించేవి. చాలా వరకు మరమ్మతుల విషయంలో లెక్కాపత్రం లేకుండా బొక్కేసినట్టు సమాచారం.ఇలా లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయి ఇన్‌చార్జి, ఇంజనీరింగ్ విభాగంలో ఒక అధికారి కలిసి చాలా పద్ధతిగా ఎక్కడా దొరక్కుండా లాగేసినట్టు తెలిసింది.ప్రభుత్వం మారగానే ఆ అధికారి మారిపోవడంతో వెహికల్ యార్డ్‌లో ఉన్న ఇన్‌చార్జి గొంతులో వెలక్కాయ పడింది. కొత్త అధికారిని లైన్‌లో పెట్టుకుని పాత పాట పాడుదామని అనుకుంటున్న తరుణంలో కమిషనర్ కేతన్ గార్గ్‌కు అనుమానం వచ్చి వాహనాలను తనిఖీ చేశారు. మరమ్మతుల విషయంలో కొన్ని విషయాలు ఆరా తీయడంతో ఒక్కసారిగా ఈ ముఠా ఖంగుతిని సైలెంట్‌టైపోయింది. కమిషనర్ వెహికల్ యార్డ్‌ను తనిఖీ చేయడంతో చాలా విషయాలు బయటకు వచ్చి ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రాధాన్యతను తగ్గించారు. వాహనాల ఆయిల్ కూపన్ కూడా వెహికల్ యార్డ్‌కు సంబంధం లేకుండా చేశారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడంతో ఆయిల్ స్కామ్ జరుగకుండా చెక్ పడింది.మరి గతంలో జరిగిన దోపిడీపై సిబ్బందిని పక్కన పెట్టారు కానీ..ఆయిల్ దుర్వినియోగం, అవకతవకలపై మాత్రం ఎటువంటి విచారణ లేదు.

## మినీ గోకులాలపై
# అలక్ష్యం!



- షెడ్ల నిర్మాణాల్లో ఏదీ పురోగతి
- జిల్లాకు మంజూరైనవి 675
- పూర్తయినవి 322
- ఊపందుకోని నిర్మాణాలు

గోకవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మినీ గోకులాల పథకం కేటాయింపులు వేగవంతంగా చేస్తున్నట్టు ఇటీవల మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి ప్రకటించారు.. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే మినీ గోకులాలకు రైతులు ఎదురుచూస్తుంటే అధికారుల మాత్రం నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒక పక్క రైతుల ఆశలను మరో పక్క ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. జిల్లాలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది పాడి పోషణపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాడి రైతాంగానికి ఎటువంటి చేయూత లభించలేదు. పైగా గతంలో నిర్మించిన గోకులాలను గాలికొదిలేశారు. పశువులు, కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకందార్లను అసలు పట్టించుకోలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి రైతుల సంక్షేమంలో భాగంగా మినీ గోకులాల నిర్మాణానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. గోకులం షెడ్ల నిర్మాణానికి రాయితీలు ఇచ్చారు. దీంతో పాడి రైతాంగం, కోళ్ల పెంపకందారుల నుంచి అధికారులకు వందలాది దరఖాస్తులు అందాయి. కానీ షెడ్ల నిర్మాణాలకు అధికారుల నుంచి అనుమతులు మాత్రం లభించడంలేదు. షెడ్ల నిర్మాణ లక్ష్యం ఇప్పటికే పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ఇంత వరకూ సగం నిర్మాణాలు పూర్తి కాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువై మంజూరు కాబడిన షెడ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించ డంలేదు. దీని వల్ల కొత్తగా షెడ్ల నిర్మాణాల కు ఎదురుచూస్తున్న రైతుల్లో నిరాశ నెలకొంది.పాతవారు పూర్తి చేస్తేనే తమకు షెడ్లు మంజూరు చేయడం ఏమిటంటూ అధికారులపై మండి పడుతున్నారు.

### జిల్లాకు 675 షెడ్లు

తూర్పుగోదావరి జిల్లాలోని 18 మండలాలకు సుమారు 675 మినీ గోకులం షెడ్లు మంజూరు చేశారు.ఒక్కో షెడ్డుకు రూ.లక్ష పైనే అందజేస్తారు. రాయితీ సుమారు 75 శాతం పైనే ఉంది. దీంతో షెడ్లకు డిమాండ్ పెరిగింది. అయితే కేటాయింపులు మాత్రం జరగడంలేదు.జిల్లాలో ఇప్పటి వరకు 322 వరకూ పూర్తయినట్టు లెక్కల్లో చూపి స్తున్నారు.మరికొన్ని నిర్మాణాల్లో ఉన్నాయంటున్నారు. సుమారు రెండు నెలలు కావొస్తున్నా సగం షెడ్ల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో కొత్తగా షెడ్ల నిర్మాణాలకు ఎదురుచూస్తున్న పాడి రైతుల్లో నైరాశ్యం నెలకొంది. గోకులం షెడ్లకు రాయితీ ఎక్కువగా ఉండంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు. ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లాలో మినీ గోకులాల నిర్మాణాలపై దృష్టి సారిస్తే తప్ప ఊపందుకునేలా కనిపించడంలేదు.

# హెల్మెట్ పెట్టుకునే.. వాహనం నడపండి

**కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ.. వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ**



న్యాయవాదులు, గుమస్తాలకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న అనురాధ

కొవ్వూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, హెల్మెట్ పెట్టుకొనే వాహనం నడపాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. శనివారం కొవ్వూరు కోర్టు హాలులలో ద్విచక్ర వాహనదారులకు ఆమె హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, బార్ ప్రెసిడెంటు వై.చలపతి, కార్యదర్శి టి.చిట్టిబాబు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జనసైనికుడి కుటుంబానికి బీమా సాయం అందజేత



జనసైనికుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న సువర్ణరాజు

దేవరపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు భరోసాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ క్రియాశీలక సభ్యత్వం ద్వారా రూ.5 లక్షలు బీమా సౌకర్యాన్ని కల్పించడం వల్ల ఎందరో కుటుంబాలకు చేయూత అందుతోందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. దేవరపల్లికి చెందిన జనసైనికుడు అనిశెట్టి నాగదుర్గాప్రసాద్ ఎన్నికల విజయోత్సవ ర్యాలీలో ప్రమాదవశాత్తూ మరణించడంతో ఆయన కుటుంబానికి నగదు బీమా చెక్కును శనివారం అందజేశారు. ఆపదలో ఉన్న జనసైనికులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంబాల సత్తిబాబు, మాధవరపు వెంకటేశ్వరరావు, జాజిమొగ్గల శ్రీనివాస్, ఆకుల వీర్రాజు, దాసరి శేషు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత పెంపొందించేందుకు శోభయాత్ర

**హిందూ అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాతా విద్యానందగిరి**



దేవరపల్లిలో శోభాయాత్ర ప్రారంభ దృశ్యం

దేవరపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు అఖిలాంధ్ర సాధు పరిషత్ ద్వారా శోభయాత్ర నిర్వహిస్తున్నట్టు హిందూ అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాతా విద్యానందగిరి అన్నారు. దేవరపల్లిలో శనివారం సాయంత్రం అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శోభయాత్ర ప్రారంభమై గ్రామదేవత కడియాలమ్మ ఆలయం నుంచి కరుటూరు ఫంక్షన్ హాలు వేదిక వరకు భజన సంకీర్తనలతో, వాయిద్యాలతో సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో బోధించినట్టు అన్ని జీవరాశుల్లో కంటే మానవ జన్మ ఎంతో ఉత్తమమైందన్నారు. సుమారు 400మంది ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపన్యాసాలు చేస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గద్దే మునేశ్వరరావు, బళ్లా సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి వెంకట్రామారావు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మమ్మ జాతర

పెరవలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కాకరపర్రులో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి చీర, సారే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రతీ కుటుంబం ఒక్కొక్క కావిడితో అమ్మవారిని సాగనంపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, పెరవలి డిస్ట్రిబ్యూటరి కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు**

# భారతరత్న ఇవ్వాలి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- టీడీపీ వ్యవస్థాపకుడి వర్ధంతి
- పలువురు నాయకుల నివాళి
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు



నిడదవోలులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

కొవ్వూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు భారత ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని పలుచోట్ల శనివారం నిర్వహించారు. కొవ్వూరులోని బస్టాండ్ సెంటర్, విజయ విహార్ సెంటర్, కంటమణి వారి వీధిలో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వాత్సల్యా వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ ఎన్టీఆర్ అటు సినిమా రంగంలోను, ఇటు రాజకీయ రంగంలోను నెంబర్ వన్‌గా నిలిచారన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించి పేదల కోసం కిలో రూ.2కు బియ్యం, జనతా వస్త్రాలు, ఎన్టీఆర్ గృహ నిర్మాణం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం, స్థానిక ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, అర్జిల్లి రామకృష్ణ, కాగిత రఘు, బర్ల శ్రీనివాస్, రాజాన సత్యనారాయణ, పెనుమాక జయరాజు, కేవీకే రంగారావు పాల్గొన్నారు. స్థానిక టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి కేఎస్ జవహర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ స్థాపించిన 9 నెలల్లో అధికారం చేపట్టి ప్రపంచ వ్యాప్తంగా చరిత్ర సృష్టించారు. ఎన్టీఆర్‌ను స్మరించుకోవడం తెలుగువారిని గౌరవించుకోవడమేనని జవహర్ అన్నారు. కార్యక్రమంలో బూరుగుపల్లి రాఘవులు, పసలపూడి బోసు, ముత్యాలరాంబాబు, పీవీవీ భద్రం పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్, ఉడతా వీరేంద్ర, కూచిభట్ల ప్రసాద్ పాల్గొన్నారు. పోచవరంలో అనపర్తి పరమేశ్వరరావు, ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అన్నదేవరపేటలో యువగళం సభ్యులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్వర్ణ విగ్రహానికి పాలభిషేకం చేశారు.అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తాడిపూడిలో నామా సురేంద్ర, రాధాకృష్ణ, మలకపల్లిలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉపసర్పంచ్ రామారావు, పెద్దేవంలో కోడె శంకరం, బోడపాటి కాశీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చాగల్లు:** చాగల్లులో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళుర్పించారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వృద్ధాశ్రమంలోను పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, జొన్నకూటి సుబ్బారావు, వెంకాయమ్మ పాల్గొన్నారు. ఊనగట్లలో బొల్లిన శివనాగేంద్ర, బ్రాహ్మణగూడెంలో గారపాటి శ్రీనివాసరావు, పెద్ద శ్రీను, పత్తిపాటి సుబ్బారావు, దారవరంలో బొడ్డు రాజు, చంద్రవరంలో మద్దిపాటి వీరరాఘవులు, మల్లవరంలో కోడూరి కాశిగంగాధరం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**పెరవలి:** పెరవలిలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగపల్లి శేషారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ దేశాల్లో చాటి చెప్పిన ఘనత ఎన్టీ రామారావుకు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు, దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అతికాల రామకృష్ణమ్మ, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, నల్లా సురేంద్ర, నందమూరి నారాయణరావు, సలాది శ్రీహరి, కంటిపూడి సూర్యనారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, నడిపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.



బ్రాహ్మణగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

**దేవరపల్లి:** మండలంలోని యర్నగూడెం, దేవరపల్లి, యాదవోలు, దుద్దుకూరు, చిన్నాయిగూడెం, గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్‌టీఆర్ వర్ధంతి నిర్వహించి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్టీ రామారావు ఎంతో కృషి చేశారని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో గన్నమని హరికృష్ణ సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రాంబాబు, కొండపల్లి దొరయ్య, కాట్రు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



తీపర్రులో నివాళులర్పిస్తున్న నాయకులు

**గోపాలపురం:** గోపాలపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు జ్యేష్ఠ శ్రీధర్ పూలమాలలతో నివాళులర్పిం చారు. కార్యక్రమంలో శరత్ బాబు, నీటి సంఘం అధ్యక్షుడు నారాయణరావు, కూనపం ప్రసాద్‌బాబు, పడమటి శ్రీనివాసరావు, రాము, కొడవటి గంగరాజు, ఉండవల్లి దుర్గాప్రసాద్, మల్లిపూడి సుబ్బారావు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో నివాళులర్పిస్తున్న నాయకులు

**నిడదవోలు:** నిడదవోలులోని చాగల్లు రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాలలతో నివాళులర్పించారు. ఎన్టీఆర్.. టీడీపీని స్థాపించి ముఖ్యమంత్రిగా ఎన్నికై పేదల సంక్షేమానికి, అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, పేదల హృదయాల్లో ఆయన నేటికీ చిరస్థాయిగా నిలిచి ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండలాధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, నాయకులు తిరుపతి సత్యనారాయణ, షాజహాన్, తన్నీడి బోసు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

**నల్లజర్ల:** అనంతపల్లిలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, నల్లజర్లలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో గురిమిల్లి శ్రీనివాస్, గన్నమని దుర్గాప్రసాద్, బోయపాటి సుబ్బారావు, విప్పిలి వీరాఘవులు, వల్లూరి సత్తిపండు, విడియాల శ్రీను, మార్ని దుర్గారావు, గుడె సుబ్బారావు పాల్గొన్నారు. దూబచర్లలో టీడీపీ జిల్లా కార్యదర్శి కూచిపూడి ఉదయభాస్కరావు, ఎంపీటీసీ ఈడే శ్రీను, పోతవరంలో ఏలేటి సత్యనారాయణ, ఎంఎస్, ఆవపాడులో షేక్ మీరాసాహెబ్, ప్రకాశరావుపాలెంలో యద్దనపూడి బ్రహ్మరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

**ఉండ్రాజవరం:** మండలంలోని వేలివెన్నులో ఎన్టీ రామారావు విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



గోపాలపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కొవ్వూరును సుందరంగా తీర్చిదిద్దాలి
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్
- పలుచోట్ల ర్యాలీలు, మానవహారాలు



కొవ్వూరులో మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రజలు బాగస్వాములు కావాలి. .

కొవ్వూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పలుచోట్ల శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం మున్సిపల్, సచివాలయ సిబ్బంది బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఉద్యోగులతో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పారిశుధ్య సిబ్బందిని ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. కొవ్వూరులో దోమలు ఎక్కువగా ఉన్నాయని, ఇంటిని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, మేనేజర్ పి.సాయిబాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ పాల్గొన్నారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, గ్రామస్థులు, పాలకవర్గంతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బస్టాండ్ సెంటర్, పంచాయతీ కార్యాలయం, వాటర్ ట్యాంకు వద్ద పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంపల్లి సింహాచలం, పంచాయతీ కార్యదర్శి ఎస్.భూపతి, బేతిన నారాయణ, యలమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

**చాగల్లు:** చాగల్లులో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మానవహారం చేపట్టారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, కార్యదర్శి మొహమ్మద్ ఆలీ, టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**పెరవలి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద, పెరవలి, కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి ప్రతిజ్ఞ, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీవో రమణ, హౌసింగ్ డీఈ విక్టర్‌బాబు, కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

**దేవరపల్లి:** దేవరపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో పంచాయతీ అధికారులు, సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని పారిశుధ్యం, తాగునీటికి ప్రాధాన్యమిస్తున్నట్టు కార్యదర్శి కె.రవికిషోర్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గోపాలపురం:** గోపాలపురంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్యంపై ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎస్‌ఎస్ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** మండలంలోని పాలంగి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.సందీప్ మాట్లాడుతూ పల్లెలను చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేయరాదని, పంచాయతీ వాహనాల్లో మాత్రమే వేసి పారిశుధ్య నిర్మూలనకు సహకరించాలని కోరారు. తొలుత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఏఈఈలు భవాని, ఏడుకొండలు, ఏపీఎమ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జానీ పాల్గొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.



పాలంగిలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# కేసుల దర్యాప్తు సమయాన్ని కుదించాలి

**అడిషనల్ ఎస్పీ(క్రైమ్) సుబ్బరాజు**



కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సుబ్బరాజు

గోపాలపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి దర్యాప్తు సమయాన్ని కుదించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఏవీ సుబ్బరాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పెండింగు కేసుల రికార్డులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు కార్యక్రమాల్లో సంప్రదాయ నృత్యాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రయివేటు అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రేవ్ కేసులు మూడు, నాన్ గ్రేవ్ కేసులు 84, కోర్టు పరిధిలో 20 కేసులు ఉన్నాయన్నారు. జిల్లాను ఐదు జోన్‌లుగా విభజించి పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలిస్తున్నామని ఏఎస్పీ పేర్కొన్నారు.

# వేములూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేములూరులోని దీప్తి స్కూల్ 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కొవ్వూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం వేములూరు దీప్తి స్కూల్లో 1993-94 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. అమెరికా, హైదరాబాద్, విజయనగరం, విజయవాడ ఎక్కడెక్కడో స్థిరపడిన 40 మంది విద్యార్థులు 30 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలను, తరగతి గదుల్లో వెళ్లి చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 16 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉప్పులూరి ఫణీంద్ర, లింగోలు సురేష్, ఎ.అనీల్‌చంద్ర, గురుమూర్తి, వి.డేవిడ్ రాజు, మన్యం మూర్తి, విశాలక్షి, కలగర లక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

**ప్రధానోపాధ్యాయురాలు సాయిచంద్ర**

## గుండెపోటుతో మృతి



సాయిచంద్ర(ఫైల్)

తాళ్లపూడి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం మండల పరిషత్ జూనియర్ బేసిక్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తైలం సాయి చంద్ర (50) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. సాయి చంద్ర సంక్రాంతి శెలవులకు భర్త, పిల్లలతో నర్సీపట్నం వెళ్లారు. సెలవులు ముగిసిన తరువాత సోమవారం పాఠశాలలో హాజరవ్వాలి. చాలాకాలంగా హృద్రోగ సమస్యల తో బాధపడుతున్న ఆమె శనివారం అకస్మాత్తుగా మృతిచెందారు. హెచ్‌ఎం మృతి పట్ల ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, మండలాధ్యక్షుడు రఘువీర్‌శాస్త్రి, ఉపాధ్యాయు లు యాదం శంకరం, కనకదుర్గ, రాజారత్నం, రాజు, పద్మశ్రీమణి సంతాపం తెలిపారు.

**ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే..**

## ఇంట్లో దొంగలు పడ్డారు!

నిడదవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంనకు చెందిన తురంగి శారద నాలుగురోజుల కిందట పాముకాటుకు గురైంది. ఆమెను ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి ఆమె ఇంట్లో దొంగలు పడి 4.5 కాసులు బంగారం, 4 తులా వెండి దోచుకుపోయారు. కుటుంబీకులకు సమాచారం అందడంతో శనివారం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. గ్రామ వీఆర్వో మాచవరపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన గదుల శ్రీను (57) బలభద్రపురంలోని రామకృష్ణ ఇంజనీరింగ్ వర్క్‌షాపులో పనిచేస్తున్నాడు.

## కళాకారిణి వన్షికకు సత్కారం

ఉండ్రాజవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెంది, కెనడాలో స్థిరపడిన మొకమాటి సత్యనారాయణ, విపంచి దంపతుల కుమార్తె శాస్త్రీయ సంగీత కళాకారిణి చిన్నారి వన్షికను శనివారం గ్రామప్రముఖులు, కళాకారులు సత్కరించారు. కళాకారిణి వన్షిక వెలగదుర్రుతో పాటు వైజాగ్, తణుకు పట్టణాల్లో చేసిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ సాగి పద్మావతి, సర్పంచ్ ముదునూరి రవీంద్రరాజు, యూటీఎఫ్ నాయకుడు ముదునూరి శేఖర్ రాజు, మృదంగ విద్యాంసుడు కాపా శ్రీనివాసు పాల్గొన్నారు.

## రిటైర్డ్ టీచర్ మృతికి సంతాపం

నల్లజర్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నెక్కలపూడి పుల్లయ్య శుక్రవారం రాత్రి మృతి చెందడంపై మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. కాగా పుల్లయ్య ఇద్దరు కుమారులు కూడా ఉపాధ్యాయులే. విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు ఐవీ సత్యం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, బాలయ్య, ఎస్ఎం ఆలీసాహెబ్ సంతాపం తెలిపారు.

**ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు**

## డ్వాక్రా సీఏ ఉషారాణి ఎంపిక



నల్లజర్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర(రిపబ్లిక్ డే) వేడుకల్లో పాల్గొనేందుకు నల్లజర్ల మండలం చీపురుగూడెం నుంచి డ్వాక్రా సీఏ తలంశెట్టి ఉషారాణి ఎంపికైయింది. కృషి సఖీ సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ పొందడంతో అమెకు ఈ అవకాశం కలిగింది. ఈ నెల 22న ఢిల్లీ బయలుదేరుతున్నట్టు ఉషారాణి తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

కొవ్వూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మద్దూరు గ్రామానికి చెందిన పెనుమాక సత్యనారాయణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపవరం ఎంపీటీసీ ఎరుబండి సురేష్, నాయుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.